www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 55 | గురువారం | 1 అక్టోబర్, 2026

## మూడో రోజూ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

- చివరి గంట అమ్మకాలతో సెన్సెక్స్ 49 పాయింట్లు డౌన్
- నిఫ్టీ 96 పాయింట్లు క్షీణత
- సెప్టెంబర్‌లో సెన్సెక్స్ 5.81, నిఫ్టీ 6శాతం పతనం



7



## గిల్ డబుల్.. రోహిట్

- విండీస్‌పై భారత్ 8 వికెట్ల ఘన విజయం
- మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ 2–0తో కైవసం
- 406 పరుగుల ఛేదనతో భారత్ కొత్త రికార్డు

కెప్టెన్ శుభ్‌మన్ గిల్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ విధ్వంసక బ్యాటింగ్‌తో భారత్ వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. వెస్టిండీస్‌తో రెండో వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. విండీస్ నిర్దేశించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని 43.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 2–0తో ఆధిక్యంలో నిలిచింది. ఛేదనలో గిల్ (133 బంతుల్లో, 223, నాటౌట్) డబుల్ సెంచరీ సాధించగా, రోహిత్ శర్మ (101, 75 బంతుల్లో) పరుగులు చేశాడు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 254 పరుగుల రికార్డు భాగస్వామ్యం అందించారు.



7



## కేటీఆర్.. దమ్ముంటే మీ ఆస్తులపై
# శ్వేతపత్రం కోరాలి

అమెరికాలో చిప్పలు, బాత్రూములు కడిగితే లక్ష కోట్లు ఎలా సంపాదించారో చెప్పాలి

- ఈసారి సిరిసిల్ల గడిని నేలమట్టం చేస్తాం.. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రిని చేస్తాం
- వచ్చే ఎన్నికల్లో పద్మశాలి బిడ్డను ఎమ్మెల్సీగా చేస్తాం • తెలంగాణలో లక్ష కోట్లు సంపాదించుకున్న సంపన్న కుటుంబం కేసీఆర్‌ది
- హైటెక్ సిటీ, బంజారాహిల్స్‌లో వందల గదులతో స్టార్ హోటల్ సంపాదించుకున్నారు
- దళితులు నడిచిన దారిలో పసుపు నీళ్లు చల్లిన మిమ్మల్ని తెలంగాణ సమాజం సహించదు
- సిరిసిల్ల బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజం

**ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో**

లక్ష కోట్లు దోచుకున్న కేసీఆర్ కుటుంబ పాలన కావాలో, పేదల ప్రజా పాలన కావాలో ప్రజలు ఆలోచించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సిరిసిల్ల ప్రజలను కోరారు. ఎర్రబెల్లి– వెంకటాపూర్ మధ్య దళితుల భూములను, సిరిసిల్లలో కేటీఆర్ అనుచరులు దోచుకున్న భూములపై శ్వేతపత్రం అడుగుతున్నారని కేటీఆర్‌కు దమ్ముంటే నీ తండ్రి కొడుకుల ఆస్తులు, హరీశ్‌రావు, సంతోష్ రావు ఆస్తులపై శ్వేత పత్రం అడగాలని ముఖ్యమంత్రి సవాలు విసిరారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం సిరిసిల్ల ప్రజా పాలన భారీ బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ అవినీతి పాలనపై ఘాటైన విమర్శలు చేశారు. ఈసారి సిరిసిల్లలో గడిని నేలమట్టం చేస్తామని కాంగ్రెస్ కార్యకర్తలు ఫిరంగులై పేలుతారని ఇదే తన ప్రతిజ్ఞ అని అన్నారు. సిరిసిల్లలో మార్పు రాబోతున్నదని ఇక్కడి ఆడబిడ్డల ఉత్సాహం చూస్తే అర్థమవుతుందని, వచ్చే ఎన్నికల్లో సిరిసిల్ల గడ్డపై మూడు రంగుల కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని, మీరు గెలిపించిన అభ్యర్థిని మంత్రిని చేస్తామని, మీ కళ్ళలో ఆనందం చూడాలని, ఎప్పుడూ దోపిడీదారులను వరుసగా గెలిపించవద్దని ఈసారి మార్పు చూడాలని పిలుపునిచ్చారు. వచ్చే శాసనమండలి ఎన్నికల్లో పద్మశాలి బిడ్డను ఎమ్మెల్సీగా చేస్తామని దీనికి పీసీసీ అధ్యక్షుడు తరువాయి 2లో..





## మళ్లీ కేసీఆరే సీఎం

**వచ్చే ఎన్నికల్లో నేను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదు**

- బీఆర్ఎస్ పాలనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు
- కాంగ్రెస్ పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు
- బీఆర్ఎస్–బీజేపీ మధ్య పొత్తు ఉండదు
- రాష్ట్ర రాజకీయాలపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

2

వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని.. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ స్పష్టం చేశారు. కొచ్చిలో జరిగిన 'ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026'లో ఆయన తెలంగాణ రాజకీయాలు, బీఆర్ఎస్ భవిష్యత్తు, బీజేపీతో పొత్తు, డీలిమిటేషన్, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలపై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో సీఎం అభ్యర్థి మీరేనా అని అడిగిన ప్రశ్నకు కేటీఆర్ స్పష్టంగా సమాధానం ఇచ్చారు. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని.. రెండేళ్ల తర్వాత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## విమానంలో పైలట్ల ఘర్షణ..
# పై దుబాయ్‌లో కలకలం

- కాక్‌పిట్‌లో పైలట్‌పై మరో పైలట్ కత్తితో దాడి?
- నిమిషంలోనే 33వేల నుంచి 17వేల అడుగులకు పడిపోయిన విమానం
- ప్రయాణికులు, సిబ్బంది జోక్యంతో సౌదీలో సురక్షిత ల్యాండింగ్

**దుబాయ్:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఫ్లై దుబాయ్ విమానంలో బుధవారం తీవ్ర కలకలం చోటు చేసుకుంది. పైలట్లిద్దరి మధ్య కాక్‌పిట్‌లో ఘర్షణ జరిగిందని, ఒక పైలట్ మరో పైలట్‌పై కత్తితో దాడి చేసి విమానాన్ని కూల్చేందుకు ప్రయత్నించాడని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వెల్లడించారు. సుమారు 180మంది ప్రయాణికులతో దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఎఫ్‌జెడ్1073 విమానం సుమారు రెండున్నర గంటల తర్వాత అత్యవసర పరిస్థితిని ఎదుర్కొంది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8.44 గంటలకు విమానం నుంచి అత్యవసర సందేశం వెళ్లింది. ఆ సమయంలో విమానం 33 వేల అడుగుల ఎత్తులో ఉంది. కేవలం ఒక నిమిషంలోనే 17 వేల అడుగులకు దిగిపోయింది. అనంతరం జోర్డాన్ సరిహద్దు సమీపంలో చక్కర్లు కొట్టిన విమానం సుమారు గంట తర్వాత సౌదీ అరేబియాలోని తబూక్‌లో సురక్షితంగా దిగింది. ఘటనలో ఇద్దరు పైలట్లకు గాయాలు కాగా, వారికి ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఒక పైలట్‌ను సౌదీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు నెతన్యాహు తెలిపారు.

### కాక్‌పిట్‌లోకి ఎలా వెళ్లారు?

ఘర్షణ సమయంలో ఓ ప్రయాణికుడు, విమాన సిబ్బందిలో ఒకరు కాక్‌పిట్‌లోకి ప్రవేశించి దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించినట్లు నెతన్యాహు తెలిపారు. అనంతరం ఇతర సిబ్బంది కాక్‌పిట్‌లోకి వెళ్లి విమానాన్ని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. అయితే విమాన ప్రయాణ సమయంలో కాక్‌పిట్ తలుపులు భద్రతా కారణాలతో లోపలి నుంచి లాక్ అయి ఉంటాయి. అలాంటి తలుపులను ప్రయాణికుడు, సిబ్బంది ఎలా తెరిచారన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఈ ఘటనలో పైలట్ వద్దకు కత్తి ఎలా చేరిందన్నది కూడా ప్రశ్నగా మారింది. కత్తి పరిమాణం ఎంత అన్నది తెలియరాలేదు. విమాన పైలట్లకు సాధారణంగా మెటల్ డిటెక్టర్ల ద్వారా తరువాయి 2లో..





## పసిడి పతకాల జోరు

- ఆసియా క్రీడల్లో భారత్‌కు ఒకే రోజు నాలుగు స్వర్ణాలు
- ఆర్చరీలో హ్యాట్రిక్.. షూటింగ్‌లో మరో పసిడి

7

- 60కి చేరిన మొత్తం పతకాల సంఖ్య

### జగన్, మమత, పవార్
## తిరిగి పార్టీలోకి రావాలి



- కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలి
- రేవంత్‌తో నాకు ఎలాంటి విభేదాలు లేవు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

# ఈసీపై ఇండి కూటమి ఉమ్మడి పోరాటం

- ఎస్ఐఆర్‌పై రాజకీయ, న్యాయపోరాటం ఉధృతం చేయాలని నిర్ణయం • ఎన్నికల ప్రక్రియను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేలా కార్యాచరణ
- ఈసీ నియామక చట్టంపై సుప్రీంకు వెళ్లే యోచన • ఓటర్ల జాబితాల అంశాలపైనా న్యాయపోరాటం కొనసాగించాలని నిర్ణయం
- ఈవీఎంలపై చర్చ.. పేపర్ బ్యాలెట్ల పునరుద్ధరణకు పలువురి మద్దతు • సమావేశంలో చర్చకు రాని సీఈసీ అభిశంసన అంశం

ఎన్నికల కమిషన్, ఓటర్ల జాబితాల వ్యవహారంలో రాజకీయ, న్యాయపరమైన చర్యలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని ఇండి కూటమి నేతలు నిర్ణయించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంలపై బుధవారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ అంశాలపై పోరాటాన్ని రాజకీయ పార్టీలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో ప్రజలు, యువత, పౌర సమాజాన్ని భాగస్వామ్యం చేయాలని నేతలు సూచించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే అంశం సమావేశంలో చర్చకు రాలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.



2

## జగన్, మమత, పవార్
# తిరిగి పార్టీలోకి రావాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ప్రజానావ, హైదరాబాద్:** వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్దఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి.. జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు.

దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ.. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

# రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి

- బొగ్గు, నీళ్లు, స్థలం మనది.. రాజస్థాన్‌తో ఒప్పందం ఎందుకు? • సిరిసిల్ల ఏమైనా ఏమైనా శత్రు రాజ్యమా?
- ఆ జిల్లా ఇప్పుడెలా ఉందో అడిగి తెలుసుకో.. కేటీఆర్‌కు ముందు, తర్వాత అభివృద్ధి చూడు • సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు కౌంటర్

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ విద్యుత్ రంగంలో సింగరేణి–రాజస్థాన్ ఒప్పందం మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో ఉత్పత్తయ్యే విద్యుత్‌లో రాజస్థాన్‌కు వాటా ఇవ్వడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి అని.. దాని పెట్టుబడులు, వనరులు ఇతర రాష్ట్రాల ప్రయోజనాలకు ఎందుకు వినియోగించాలంటూ ప్రశ్నించారు. హరీశ్‌రావు లేఖలో ప్రధానంగా జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రస్తావించారు. ఈ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సింగరేణి గనుల నుంచే అందుబాటులో ఉందని.. నీటి అవసరాలను సమీపంలోని గోదావరి ద్వారా తీర్చుకునే అవకాశం ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. ప్లాంట్ ఉన్న స్థలం కూడా తెలంగాణలోనే ఉన్నందున ఇక్కడ ఉత్పత్తయ్యే విద్యుత్‌పై రాష్ట్ర ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే సింగరేణి, రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీయూఎన్ఎల్) మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. తెలంగాణలో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును



చేపట్టే ప్రతిపాదన ఉంది. ఇందులో తెలంగాణ, రాజస్థాన్‌కు చెరో 800 మెగావాట్ల విద్యుత్ కేటాయింపు ఉంటుందని ఒప్పంద సమయంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే బొగ్గు మనది, నీళ్లు మనవి, స్థలం మనది.. కానీ ఇక్కడ ఉత్పత్తయ్యే 800 మెగావాట్ల విద్యుత్ లో వాటా రాజస్థాన్‌కు ఎందుకు అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సింగరేణి–ఆర్‌వీయూఎన్ఎల్ భాగస్వామ్యంలో చేపట్టే విద్యుత్, సౌర ప్రాజెక్టులకు కలిపి సుమారు రూ.22 వేల కోట్ల పెట్టుబడి ఉంటుందని ఒప్పందం సమయంలో ప్రకటించారు. తెలంగాణలో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుతో పాటు రాజస్థాన్‌లో 1,500 మెగావాట్ల సోలార్ పార్క్ ఏర్పాటు ప్రతిపాదన కూడా ఇందులో ఉంది. ఈ పెట్టుబడిలో సింగరేణి వనరులను రాజస్థాన్ అభివృద్ధికి మళ్లించాల్సిన అవసరం ఏముందని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణలోనే విద్యుత్ అవసరాలు ఉన్న సమయంలో ఇతర రాష్ట్రానికి విద్యుత్ కేటాయించే నిర్ణయం ఎందుకు తీసుకున్నారో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని హరీశ్‌రావు ఆరోపించారు. కనీసం 7, 8 గంటల విద్యుత్ కూడా అందని పరిస్థితులు ఉన్నాయని ఆయన విమర్శించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు నాణ్యమైన బొగ్గు అందించాల్సి ఉండగా తక్కువ గ్రేడ్ బొగ్గు వినియోగిస్తున్నారంటూ హరీశ్‌రావు ఆరోపించారు. కొత్తగూడెం, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అంతరాయాలకు కూడా ప్రభుత్వ నిర్వహణే కారణమని విమర్శించారు.

### సిరిసిల్ల ఏమైనా శత్రు రాజ్యమా?

కాగా సిరిసిల్ల కేంద్రంగా తెలంగాణ రాజకీయాల్లో మరోసారి అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్లలో పర్యటిస్తున్న నేపథ్యంలో హరీశ్‌రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ఎమ్మెల్యేగా రాకముందు సిరిసిల్ల ఎలా ఉండేది.. ఆయన ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గంలో ఎలాంటి మార్పులు వచ్చాయో అక్కడి ప్రజలను అడిగి తెలుసుకోవాలని రేవంత్‌రెడ్డికి చురకలు అంటించారు. సిరిసిల్ల ఏమైనా శత్రు రాజ్యమా అంటూ హరీశ్‌రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్రజలకు సేవ చేయడానికి ప్రాంతాలకు వెళ్తారని.. దండయాత్ర చేయడానికి కాదని వ్యాఖ్యానించారు. సిరిసిల్ల తెలంగాణలోనే ఉందని.. అక్కడికి వెళ్లేందుకు ఇంత భారీ స్థాయిలో పోలీసు బందోబస్తు, నిర్బంధాలు ఎందుకని ప్రశ్నించారు. సీఎం పర్యటనకు ముందు సిరిసిల్లలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారన్నారు. బయట నుంచి మందిని తీసుకొచ్చినా ప్రజల అభిప్రాయాలను మార్చలేరని అన్నారు.

## మోదీ–ట్రంప్ మధ్య కీలక సంభాషణ

- ఫోన్‌లో మాట్లాడుకున్న ఇరుదేశాల నేతలు
- వాణిజ్యం నుంచి ఇంధనం వరకు విస్తృత చర్చ
- ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపైనా సమీక్ష

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. భారత్–అమెరికా ద్వైపాక్షిక సహకార పురోగతిని ఇరువురు నేతలు సమీక్షించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికత తదితర అంశాలపై చర్చించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలతో పాటు ప్రపంచ శాంతి, భద్రతకు సంబంధించిన అంశాలపైనా అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్–అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా పనిచేయాలని మోదీ, ట్రంప్ అంగీకరించారు. ఇదే సమయంలో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అమెరికా పర్యటనలో ఉన్నారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఫోన్ సంభాషణ చోటుచేసుకుంది. అమెరికా ఇటీవల అమలు చేసిన 'లిండ్సే ఓ. గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్–2026' నేపథ్యంలోనూ ఈ సంభాషణకు ప్రాధాన్యం ఏర్పడింది. రష్యా నుంచి ముడిచమురు లేదా సహజ వాయువు కొనుగోలు చేసే నిర్దిష్ట దేశాల దిగుమతులపై గరిష్ఠంగా 100 శాతం



సుంకాలు విధించే అధికారం ఈ చట్టంలోని నిబంధనలు కల్పిస్తున్నాయి. భారత్ రష్యా చమురు కొనుగోళ్లపై ఈ చట్టం ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ఇంధన భద్రత అంశం కీలకంగా మారింది. ఇటీవల విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో ఈ అంశాలపై చర్చించారు. ఇరుదేశాల నేతలు తాజా సంభాషణ అనంతరం నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు.

# పై దుబాయ్‌లో కలకలం

(మొదటిపేజీ తరువాయి)

తనిఖీలు నిర్వహించడంతో పాటు వారి నేర, ఉద్యోగ చరిత్ర, ఆరోగ్యం, భద్రతా వివరాలను పరిశీలిస్తారు. ఇజ్రాయెల్‌కు వెళ్లే విమానాల్లో భద్రతా తనిఖీలు మరింత కఠినంగా ఉంటాయి. అయితే ఈ విమానంలోని పైలట్లకు ఏ స్థాయిలో తనిఖీలు జరిగాయన్నది వెల్లడికాలేదు. 2015లో జర్మన్ వింగ్స్ విమానంలో కో–పైలట్ కెప్టెన్‌ను కాక్‌పిట్ నుంచి బయటకు పంపి ఉద్దేశపూర్వకంగా విమానాన్ని పర్వతాన్ని ఢీకొట్టించాడు. ఆ ఘటనలో విమానంలోని 150 మంది మరణించారు. తాజాగా పై దుబాయ్ ఘటనతో విమాన భద్రతలో పైలట్ల పాత్ర, కాక్‌పిట్ భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రయాణికులను కాపాడింది భారతీయుడే

పై దుబాయ్ విమానం గగనతలంలో ఉండగానే కెప్టెన్‌పై కో–పైలట్ కత్తితో దాడి చేయడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దీని వెనుక ఉగ్ర కుట్ర ఉన్నట్లు ఇజ్రాయెల్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ ఘటనలో కో–పైలట్‌తో పోరాడి.. ప్రయాణికులను కాపాడిన కెప్టెన్ భారతీయుడని తెలుస్తోంది. ఈ మేరకు ఇజ్రాయెల్ మీడియా కథనాలు వెల్లడించాయి. ఘటన సమయంలో విమానంలో 180 మంది ప్రయాణికులు ఉన్నారు. దుబాయ్ నుంచి విమానం టేకాఫ్ అయిన దాదాపు రెండున్నర గంటల తర్వాత కాక్‌పిట్‌లో ఘర్షణ చోటుచేసుకుంది. కో–పైలట్ ఉన్నట్టుండి కెప్టెన్‌పై కత్తితో దాడి చేసినట్లు సమాచారం. కాక్‌పిట్ నుంచి శబ్దాలు వినపడగానే.. ఇదే విమానంలో ఆఫ్‌డ్యూటీలో ఉన్న పైలట్లు, ప్రయాణికులు కో–పైలట్‌ను అడ్డుకున్నారు. అప్పటికే కెప్టెన్, ఫస్ట్ ఆఫీసర్ గాయపడ్డారు. కాక్‌పిట్ అంతా రక్తపు మరకలు ఉన్నాయి. ఆఫ్‌డ్యూటీలో ఉన్న ఇద్దరు పైలట్లు విమానాన్ని సురక్షితంగా సౌదీ అరేబియాలో ల్యాండ్ చేశారు.

### కూల్చేందుకు యత్నించాడా?

కత్తిపోటుకు గురైన కెప్టెన్ భారత్‌కు చెందినవాడని ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. తన ప్రాణాలకు తెగించి కోపైలట్‌తో కెప్టెన్ పోరాడారని.. విమానం కూలకుండా అడ్డుకుని 180 మంది ప్రాణాలను కాపాడారని తమ కథనాల్లో రాసుకొచ్చాయి. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక ధ్రువీకరణ ఇంకా రాలేదు.

### కో–పైలట్‌కు ద్వంద్వ పౌరసత్వం?

దాడికి పాల్పడిన కో–పైలట్ ఒమన్ జాతీయుడని ఇజ్రాయెల్ మీడియా




కథనాలు ఆరోపించాయి. అయితే, ఇజ్రాయెల్–ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు లేవు. అలాంటప్పుడు టెల్‌అవీవ్‌కు వెళ్లే విమానంలో ఒమన్ పౌరుడిని ఎలా అనుమతించారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా అరబ్/గల్ఫ్ దేశాల నుంచి ఇజ్రాయెల్ గగనతలంలోకి వచ్చే విమానాలకు కఠిన స్క్రీనింగ్ ఉంటుంది. ఒకవేళ, ఆ కో–పైలట్‌కు ద్వంద్వ పౌరసత్వం ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై దర్యాప్తు జరుపుతున్నట్లు ఇజ్రాయెల్ అధికారిక వర్గాలు తెలిపాయి.

## అదనపు డిక్లరేషన్ తొలగింపు

- ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- ఫారం–6లో కీలక మార్పు చేసిన ఈసీ
- సర్ పూర్తయిన రాష్ట్రాలకు వర్తింపు

**న్యూఢిల్లీ:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) వివాదం కొనసాగుతున్న వేళ భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునే వారికి సంబంధించిన ఫారం–6లో కీలక మార్పు చేసింది. సర్ ప్రక్రియ పూర్తయిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఫారం–6తో పాటు జత చేసిన అదనపు సర్ డిక్లరేషన్‌ను తొలగించింది. అదనపు నిబంధన కేవలం సవరణ ప్రక్రియ జరిగే సమయంలో మాత్రమే వర్తిస్తుందని, సర్ ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో మాత్రం వర్తించదని తెలిపింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషితో కూడిన పూర్తిస్థాయి కమిషన్ ఈనెల 26న సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.ఈసీ నిర్ణయం ప్రకారం, సర్ ప్రక్రియ పూర్తయిన ప్రాంతాల్లో కొత్త ఓటర్లు ఇకపై ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్దేశించిన సాధారణ ఫారం–6ను మాత్రమే పూర్తి చేయాల్సి ఉంటుంది. సర్ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం అదనపు డిక్లరేషన్ అందుబాటులో ఉంది. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే దరఖాస్తుదారులు తాము లేదా తమ తల్లిదండ్రులు, తాతయ్యలు, అమ్మమ్మలు గతంలో జరిగిన ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో రూపొందించిన ఓటర్ల జాబితాల్లో ఉన్నారనే వివరాలను అందించాల్సి ఉంటుంది. ఈ అదనపు ప్రకటనను సర్ ప్రక్రియలో భాగంగానే ఎన్నికల సంఘం తీసుకొచ్చింది. అయితే సవరణ పూర్తయిన ప్రాంతాల్లో దాని అవసరం ఉండదని స్పష్టం చేస్తూ తాజాగా ఆప్షన్‌ను తొలగించింది. సర్ పూర్తయిన ప్రాంతాల్లో అదనపు డిక్లరేషన్‌ను ఈసీఐనెట్ యాప్, పోర్టల్ నుంచి తొలగించారు. సంబంధిత రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) వెబ్‌సైట్లలోనూ ఇదే మార్పు చేశారు. ఇక ఆయా రాష్ట్రాల్లో ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునే పౌరులు రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారం–6లో అవసరమైన వివరాలను మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. ఫారం– 6కు జత చేసిన అదనపు డిక్లరేషన్ కేవలం సర్? ప్రక్రియ కోసమేనని అందులో ఈసీ పేర్కొంది. సర్ అమలులో లేని సమయంలో రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 ప్రకారం వర్తించే సాధారణ ఫారమ్‌లనే ఉపయోగిస్తామని స్పష్టం చేసింది. దీంతో సర్ పూర్తయిన ప్రాంతాల్లో సాధారణ ఫారం–6 ప్రక్రియకు తిరిగి వెళ్లేలా ఆన్‌లైన్ వ్యవస్థలో మార్పులు చేశారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన చట్టబద్ధ ప్రక్రియలో అదనపు సర్ వివరాలను అడగడం ఇకపై ఉండదు. ఫారం–6కు సంబంధించిన మార్పులపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు రావటం వివాదాస్పదంగా మారింది. ఫారం–6లో చేసిన మార్పుల అంశం గతంలో ఎన్నికల సంఘంలోనే చర్చనీయాంశమైంది. ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకునేందుకు అర్హులైన భారతీయ పౌరులు ఉపయోగించే చట్టబద్ధమైన ఫారమ్‌గానే ఫారం–6ను రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 నిర్దేశిస్తుంది.

## ఈసీపై ఇండి కూటమి ఉమ్మడి పోరాటం

**న్యూఢిల్లీ:** ఎన్నికల కమిషన్, ఓటర్ల జాబితాల వ్యవహారంలో రాజకీయ, న్యాయపరమైన చర్యలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని ఇండి కూటమి నేతలు నిర్ణయించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంలపై బుధవారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ



అంశాలపై పోరాటాన్ని రాజకీయ పార్టీలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో ప్రజలు, యువత, పౌర సమాజాన్ని భాగస్వామ్యం చేయాలని నేతలు సూచించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే అంశం సమావేశంలో చర్చకు రాలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని సవాల్ చేస్తూ ప్రతిపక్షాలు సంయుక్తంగా సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై చర్చ జరిగింది. ఎస్ఐఆర్, ఓటర్ల జాబితాలకు సంబంధించిన అంశాలపైనా న్యాయపోరాటం కొనసాగించాలని నిర్ణయించారు. ఎన్నికలను పేపర్ బ్యాలెట్ల ద్వారా నిర్వహించాలనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేశారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు 'సేవ్ డెమోక్రసీ' మార్చ్‌లు నిర్వహించడం, అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలు ఎన్నికల కమిషన్ కార్యాలయానికి మార్చ్ చేపట్టడం వంటి కార్యాచరణను కూటమి ప్రకటించింది.

# కేటీఆర్.. దమ్ముంటే మీ ఆస్తులపై శ్వేతపత్రం కోరాలి

(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీ నుంచి అనుమతి తీసుకుంటారని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తు లేదు, ఇక ఉండదు, ఉండబోదని ఇది కాంగ్రెస్ కార్యకర్తల ఒట్టు అని రేవంత్ రెడ్డి ప్రతిజ్ఞ చేశారు. ధైర్యం, దైవం కలిసి వెలిసిన ప్రాంతం సిరిసిల్ల అని, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో దైవ చింతన, మన పూర్వీకులు నిజాం రద్దాకర్లపై చేసిన విరోచిత పోరాటానికి మీరు వారసులని అభివర్ణించారు. సిరిసిల్ల అంటే సిరులకు నిలయం, కానీ 10 సంవత్సరాల బీఆర్ఎస్ హయాంలో ఉరి సిల్లగా మారింది, కాదు మార్చారని విమర్శించారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన చీరలు, అగ్గిపెట్టెలో చీరను పెట్టగల నైపుణ్యం ఇక్కడి చేనేత కార్మికుల సొంతం అని పేర్కొన్నారు.

### సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చింది బీఆర్ఎస్సే

సిరిసిల్ల ఉరిసిల్లగా మారితే 2009లో చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినట్లు కేకే మహేందర్ రెడ్డి తయారు చేసుకున్న స్థితిలో, మోసంతో ఆయన పార్టీ టికెట్ను కేటీఆర్ లాక్కొని 171 ఓట్లతో చావు తప్పి గెలిచారని, సిరిసిల్ల ప్రజలు వేసిన ఓట్లతో వేల కోట్లు అక్రమ సంపాదన సంపాదించుకొని ప్రపంచంలోనే ధనిక కుటుంబంగా కేసీఆర్ కుటుంబం ఆవిర్భవించిందని ధ్వజమెత్తారు. 2009 నుంచి 2023 వరకు అరడజనుసార్లు జరిగిన ఎన్నికలలో కేటీఆర్ గెలిచినప్పటికీ చేనేత కార్మికుల ఆత్మహత్యలను ఎందుకు ఆపలేదు? కార్మికుల గల్ఫ్ వలసలు ఎందుకు ఆగలేదు ప్రజలు ఆలోచన చేయాలన్నారు. గల్ఫ్ వెళ్లిన కార్మికులు అక్కడ ప్రమాదవశాత్తు మరణిస్తే కనీసం శవాలను తెచ్చుకునే పరిస్థితి కూడా లేదు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో గల్ఫ్ కార్మికుల కుటుంబాల కోసం ఒక క్షణమైన ఆలోచన చేయలేదన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ చేయాలని ఇక్కడి స్థానిక నాయకులు కోరితే ప్రమాదవశాత్తు విదేశాలలో ఇక్కడ కార్మికులు మరణిస్తే శవాన్ని తేవడంతో పాటు సంబంధిత కుటుంబానికి 5 లక్షల రూపాయలు సహాయం అందించే పథకం ప్రజా ప్రభుత్వం తయారు చేసిందన్నారు. 2004,2006, 2008 మూడుసార్లు కరీంనగర్ జిల్లా ప్రజలు కేసీఆర్ను ఎంపీగా గెలిపిస్తే, ఇక్కడి ప్రజల హామీలను మరిచి 2009 లో పారిపోయి పాలమూరుకు కేసీఆర్ వలస వచ్చారని ఆరోపించారు. దళిత స్పీకర్‌ను అవమానించినందుకు దళితులు చావు డబ్బులు కొడితే దొర అహంకారంతో పసుపు నీళ్ల చల్లి శుద్ధిచేసిన ఘటనను ప్రజలు దళితులు మరిచిపోరని ఇది సహించరానిదని ఇది కండకావరం కాదా అవమానం కాదా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు తెలంగాణ సమాజం బహిష్కరించే వరకు వదిలిపెట్టదన్నారు.

### లక్ష కోట్ల అవినీతి చేసింది

ప్రజలను మోసం చేసిన కల్వకుంట్ల కుటుంబం లక్ష కోట్ల అవినీతి చేసిందని, హైటెక్ సిటీలో స్టార్ హోటల్లు 400 గదులతో, 190 గదులతో ఆంధ్రావారి పేరుతో సంపాదించుకున్నారని, బంజారాహిల్స్ లో హోటల్లు ఉన్నాయని, అమెరికాలో, సింగపూర్‌లో ఆస్తులు దాచుకున్నారని సీఎం బహిర్గతం చేశారు. అమెరికాలో ఎన్ని వేల బాత్రూంలు కడిగి వేల కోట్లు ఎలా సంపాదించారో సంబంధిత కేటీఆర్ బయట పెట్టాలన్నారు. అన్ని పనుల్లోనూ చివరకు ఆడబిడ్డల బతుకమ్మ చీరల్లోనూ కమిషన్లు దండుకున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోనే లక్ష కోట్ల ఆస్తులు సంపాదించుకున్న సంపన్న కుటుంబం కేసీఆర్‌ది అన్నారు. గోదావరి జలాలను అడ్డం పెట్టుకొని రవీందర్ రావు, సంతోష్ రావు, తారకరామారావు మానేరు ఇసుకను దోచుకున్నది వాస్తవం కాదా, వీటికి సజీవ సాక్ష్యం నేరెళ్ల బాధితులు అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాట్లు కీలకపాత్ర పోషించిన లోక్ సభ మాజీ స్పీకర్ మీరా కుమారి జగ్జీవన్ రామ్ బిడ్డను ఇక్కడికి తీసుకుని వస్తే పోలీసులతో నిర్బంధించిన మాట వాస్తవం కాదా, మిడ్ మానేరు డ్యాం ముంపులో కొంప పోయిందని కేసీఆర్ కుటుంబ సభ్యులు ఇంట్ల స్థలాలు పొందలేదా? పని ప్రశ్నించారు. సిరిసిల్ల ప్రజల ఓట్లు కేటీఆర్‌కు పచ్చ నోట్లుగా తయారయ్యాయని, వేములవాడ శివయ్య, భద్రాచలం రామయ్యను మోసం చేసినవాడు కేసీఆర్ ఒక్కడు మాత్రమేనన్నారు. వెయ్యి రోజుల ప్రజా పాలనలో రూ.1741 కోట్లు నేత కార్మికుల కోసం ఖర్చు చేశామని, వేములవాడ రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1700 కోట్లు నిధులు మంజూరు చేసామని, నూలు డిపో వేములవాడలో ఏర్పాటు చేశామన్నారు. మానేరు నది మీద కట్టిన చెక్ డాంలు కొట్టుకపోయి కేసీఆర్ ఇంట్లో నోట్ల కట్టలుగా తేలాయి. కాలేశ్వరం ప్యాకేజీ 9, 10, 11,12 పూర్తి చేయకుండా పెండింగ్ పెట్టడం వల్ల ఇక్కడ రైతులకు గోదావరి నీళ్లు చేరలేదన్నారు. గత పాలకులు కనీసం పేదలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆడపిల్లలకు ఇచ్చే బతుకమ్మ చీరలో కమిషన్ కొట్టేసారని సీఎం ఆరోపించారు. బతుకమ్మ చీరలకు 350 కోట్ల రూపాయల బకాయిలు పెడితే ప్రజా ప్రభుత్వం చెల్లించిందని, రేషన్ కార్డులు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు సన్నబియ్యం వంటి పథకాలు గత పాలకులు అమలు చేయలేదన్నారు. కోటి ఆరు లక్షల కుటుంబాలకు మూడు కోట్ల 46 లక్షల లబ్ధిదారులకు నేడు సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తున్నాం. ఆర్టీసీ బస్సులలో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. మహిళల కోసం 12 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఉచిత బస్సు కింద చెల్లించింది. గత పాలకులు ఇచ్చిన బతుకమ్మ చీరలు ఎప్పుడు ఆడపిల్లలు కట్టుకోలేదు. ఈ పండుగకు చిలక చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. రైతు భరోసా కింద 36000 కోట్లు రుణమాఫీ కింద 20614 కోట్లు రైతులకు చెల్లించాము. 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసాం ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీకు జీతాలు చెల్లిస్తున్నాం, రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించామని వెల్లడించారు. ఈ సభలో ప్రత్యేక సలహాదారులు సుదర్శన్ రెడ్డి, రాజ్యసభ ఎంపీ వేమూరి నరేందర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు మల్లురవి, చామల కిరణ్ రెడ్డి, సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, ప్రభుత్వ సలహాదారు వర్కర్ వేణుగోపాల్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం బీర్ల ఐలయ్య, మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం కవంపల్లి సత్యనారాయణ, మదన్‌మోహన్ రావు లక్ష్మీ కాంతరావు డాక్టర్ సంజయ్ (శ్రీ గణేష్ నాగరాజు, కుంభం అనిల్ రెడ్డి నవీన్ యాదవ్, సంపత్ కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సంబం



## బీజేపీ ఓబీసీ మోర్చాకు కొత్త బాధ్యతలు

- వల్లపు శంకర్, బోయ రామాంజనేయులుకు అభినందనలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** ఫిలింనగర్ డివిజన్‌కు చెందిన వల్లపు శంకర్‌ను భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా, బోయ రామాంజనేయులును ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమించిన సందర్భంగా వారు ఖైరతాబాద్ మాజీ శాసనసభ్యులు, బీజేపీ నేత చింతల రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చింతల రామచంద్రారెడ్డి శంకర్, రామాంజనేయులుకు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ఓబీసీ వర్గాల సంక్షేమం, హక్కులు, సాధికారత కోసం కృషి చేయాలని సూచించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ, ఓబీసీ మోర్చాను చురుకైన పాత్ర పోషించేలా ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకట్ స్వామి, జిల్లా కార్యదర్శి శ్రావణ్ యాదవ్, ఫిలింనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు దొంగరి రాజకళ, ఆనంద్ సాగర్, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు జి. రమ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కుస్తీ, యోగా ఎంపిక పోటీలు ఉత్సాహంగా

- అండర్–14, 17 విభాగాల్లో క్రీడాకారుల ప్రతిభకు పరీక్ష
- రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



**ప్రజానావ, ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–14, 17 ఏళ్ల విభాగం బాలబాలికల జోనల్ స్థాయి (ఉమ్మడి జిల్లా) కుస్తీ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో నిర్మల్, కుమురం భీమ్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా డీవైఎస్ఓ దయానంద్‌రెడ్డి, డీటీఎస్ఓ పార్థసారథి హాజరై కాసేపు పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంప్రదాయ క్రీడ అయిన కుస్తీలో రాణించాలంటే శిక్షకుల పర్యవేక్షణలో ప్రతిరోజూ క్రమం తప్పకుండా సాధన చేయాలని క్రీడాకారులకు సూచించారు. రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల క్రీడా సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి ఆడే రామేశ్వర్, సహాయ కార్యదర్శి సాయికుమార్, కుస్తీ కోచ్ శ్రీధర్ పాల్గొన్నారు. ఇదే క్రీడా ప్రాంగణంలోని జూడో హాలులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి అండర్–14, 17 ఏళ్ల బాలబాలికల యోగా ఎంపిక పోటీలను డీవైఎస్ఓ దయానంద్‌రెడ్డి, డీటీఎస్ఓ పార్థసారథి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించవచ్చని తెలిపారు. భారతదేశంలో పుట్టిన యోగాను నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనుసరిస్తూ ప్రయోజనాలు పొందుతున్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్మల్‌లో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆడే రామేశ్వర్ తెలిపారు.

## విద్యార్థులకు వ్యక్తిత్వ నిర్మాణంపై క్విజ్

- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత



**ప్రజానావ, ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాల కృష్ణ మఠంలో డా. హెచ్.వి. వజే సేవా సమితి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు 'వ్యక్తిత్వ నిర్మాణం' అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రగతి విద్యా సంస్థలు, శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. బుధవారం మధ్యాహ్నం మఠంలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు మఠాధిపతి యోగానంద సరస్వతి, ప్రముఖ రచయిత సామల రాజవర్ధన్ చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు, ప్రత్యేక బహుమతిగా రూ.వెయ్యి చొప్పున అందించారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, జ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు డా. ప్రఫుల్ వజే, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, సభ్యులు బండారి దేవన్న తదితరులు పాల్గొన్నారు.



## కలి దోష నివారణకు లక్ష గరిక పూజ

- శ్రీ లక్ష్మీ గణపతికి అభిషేకం, అర్చన
- నవగ్రహ అరుణ రుద్రచండీ హోమం నిర్వహణ

**ప్రజానావ, మహబూబాబాద్ :** కలి దోష నివారణ, లోక కల్యాణాన్ని ఆకాంక్షిస్తూ శ్రీ రామమందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రామాలయంలో శ్రీ లక్ష్మీ గణపతి పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు తాటిపాముల నరసింహామూర్తి, గుడి రాధాకృష్ణమూర్తి, కొడకండ్ల గౌతమ్, కౌషిక్, చిట్టా శ్రీకాంత శాస్త్రి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహానికి అభిషేకం, అర్చనతో పాటు లక్ష గరిక పూజ నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో వేద మంత్రోచ్ఛారణల నడుమ గణపతి నవగ్రహ అరుణ రుద్రచండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# సింగరేణి లాభాల ప్రకటన ఎప్పుడో?

- దసరా సమీపిస్తున్నా బోనస్‌పై స్పష్టత కరవు
- లాభాల్లో కనీసం 35 శాతం వాటా ఇవ్వాలని కార్మికుల డిమాండ్



**ప్రజానావ, వరంగల్:** ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు కావస్తున్నా సింగరేణి యాజమాన్యం ఇప్పటివరకు లాభాలను ప్రకటించకపోవడంతో కార్మికుల్లో ఆందోళన నెలకొంది. ఏటా దసరా పండగకు ముందే సంస్థ లాభాల్లో కార్మికులకు వాటా (బోనస్) చెల్లించడం ఆనవాయితీగా వస్తుండగా, ఈసారి పండగ సమీపిస్తున్నా యాజమాన్యం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంపై ఉద్యోగులు, కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు సింగరేణి ఉత్పత్తి సంవత్సరంగా పరిగణించి లాభనష్టాలను లెక్కిస్తారు. యాజమాన్యం లాభాలను ప్రకటించిన అనంతరం అందులో కార్మికులకు ఎంత శాతం వాటా ఇవ్వాలనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఆ నిర్ణయం వెలువడిన తర్వాత బోనస్ సొమ్ము కార్మికుల ఖాతాల్లో జమ కావడానికి మరో 20 నుంచి 25 రోజుల సమయం పడుతుంది. అక్టోబరు 20న దసరా పండగ ఉన్న నేపథ్యంలో ఇప్పటివరకు లాభాల పంపిణీపై స్పష్టత లేకపోవడంతో సింగరేణి వ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. 1998–99 ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి రూ.121.80 కోట్ల లాభాలు రాగా, అప్పటి ప్రభుత్వం 10 శాతం వాటాను ప్రకటించింది. అప్పటి నుంచి కార్మికులకు లాభాల్లో వాటా పంపిణీ ఏటా పెరుగుతూ వస్తోందని కార్మికులు పేర్కొంటున్నారు. ఈసారి కనీసం 35 శాతానికి తగ్గకుండా లాభాల వాటా చెల్లించాలని వారు కోరుతున్నారు. ఎలాంటి కోతలు విధించకుండా సంస్థకు వచ్చిన నికర లాభాల నుంచే కార్మికులకు వాటా అందించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు కోల్ ఇండియాలో దసరా పండగకు ముందే పనితీరు బోనస్ చెల్లిస్తుండగా, సింగరేణిలో మాత్రం దీపావళి సందర్భంగా బోనస్ చెల్లిస్తున్నారని కార్మికులు చెబుతున్నారు. **జూన్ ముందే చెల్లిస్తే మేలు:** ఉత్పత్తి సంవత్సరం ముగిసిన తర్వాత జూన్, జులై నెలల్లో పిల్లల పాఠశాల ఫీజులు, పుస్తకాలు, ఇతర విద్యా ఖర్చులతో కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతుందని కార్మికులు చెబుతున్నారు. ఉత్పత్తి సంవత్సరం పూర్తయిన వెంటనే జూన్ మాసానికి ముందే లాభాలను ప్రకటించి వాటాను చెల్లిస్తే తమ కుటుంబ అవసరాలకు ఎంతో ఆసరాగా ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.







# కొమురం భీమ్ కాలనీ గిరిజనులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

- మ్రౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలి
- గ్రవర్నర్‌ను కోరిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ప్రజానావ, హైదరాబాద్:** ఆదిలాబాద్ జిల్లా మావల మండలం బట్టిస్వర్గావ్ గ్రామంలోని కొమురం భీమ్ కాలనీలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు ఇంటి స్థల పట్టాలు జారీ చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కోరింది. బుధవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన ప్రతినిధి బృందం ఈ మేరకు వినతిపత్రం సమర్పించింది. మావల మండలం బట్టిస్వర్గావ్ గ్రామం సర్వే నంబర్ 72లోని కొమురం భీమ్ కాలనీలో సుమారు 500 గిరిజన కుటుంబాలు దాదాపు 30 ఏళ్లుగా నివసిస్తున్నాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికీ వారికి ఇంటి స్థల పట్టాలు లేదా గుర్తింపు పొందిన ఇంటి స్థల హక్కులు కల్పించలేదని, దీంతో విద్యుత్, సురక్షితమైన తాగునీరు తదితర మౌలిక సదుపాయాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు సమగ్ర క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, వర్తించే నిబంధనల ప్రకారం ఇంటి స్థల పట్టాలు జారీ చేయడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేయాలని ప్రతినిధి బృందం గవర్నర్‌ను కోరింది. ఇంటి పట్టాలు మంజూరు చేస్తే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఆదివాసీ గిరిజన కుటుంబాలు ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతినిధి బృందం వినతిని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సానుకూలంగా విని, సమర్పించిన వినతిపత్రాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆదివాసీ ప్రతినిధులు గిరిజన సంస్కృతికి ప్రతీకగా నిలిచే సంప్రదాయ గుస్సాడీ నెమలి పింఛాల కిరీటాన్ని గవర్నర్ శిరస్సుపై అలంకరించి గౌరవంగా సత్కరించారు. ఈ సమావేశంలో మెదక్ లోక్‌సభ సభ్యుడు ఎం. రఘునందన్‌రావు పాల్గొన్నారు. అంతకుముందు ఎంపీ ఎం. రఘునందన్‌రావు లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.



## బ్రహ్మణకుంటకు కబ్జా బెడద

- ఆలయ భూముల పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యం
- క్షేత్రస్థాయి విచారణకు గ్రామస్థుల డిమాండ్

**ప్రజానావ, స్టేషన్‌ఘన్‌పూర్:** స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, హనుమకొండ, అయినవోలు మండలాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న కూనూర్ శ్రీరంగనాయకుల దేవస్థానానికి చెందిన బ్రహ్మణకుంట ఆక్రమణకు గురవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆలయ భూములను కాపాడాల్సిన వారే కబ్జాదారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నా దేవాదాయశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. **గ్రామస్థులే ఆక్రమణదారులా?:** ఒకప్పుడు గ్రామస్థుల తాగునీటి అవసరాలకు బ్రహ్మణకుంట నీటినే వినియోగించుకునేవారు. ప్రస్తుతం కూడా కుంట కింద నిర్మించిన బావి నీటిని మంచినీటి ట్యాంకుల్లో నింపి గ్రామానికి సరఫరా చేస్తున్నారు. మొత్తం 8.02 ఎకరాల విస్తీర్ణం కలిగిన కుంటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, విద్యుత్ సబ్‌స్టేషన్, పల్లె ప్రకృతి వనం ఏర్పాటుకు దాదాపు నాలుగు ఎకరాల స్థలాన్ని వినియోగించారు. మరో గుంట స్థలాన్ని ఓ సామాజిక వర్గానికి చెందిన వారు ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కుంట ముందు భాగంలోని స్థలాన్ని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికులు చెబుతున్నారు.

### క్షేత్రస్థాయి విచారణ అవసరం

ఆలయ భూముల ఆక్రమణలు జరుగుతున్నా దేవాదాయ, పంచాయతీ శాఖల అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర నిర్మాణాలకు నాలుగు ఎకరాలు వినియోగించగా మరో ఎకరం వరకు కబ్జాకు గురైనట్లు సమాచారం. ఆలయ భూములను పరిరక్షించాలని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నెల్లుట్ల వకుళాదేవి పలుమార్లు దేవాదాయ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన లేదని పేర్కొన్నారు. రాజకీయ అండదండలతోనే ఆక్రమణలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి ఆలయ భూముల హద్దులను నిర్ధారించి, ఆక్రమణలను అడ్డుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.






# రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనకు గవర్నర్ చేయూత

- గులాబీ కాంతులతో లోక్‌భవన్
- ముందస్తు గుర్తింపుతోనే ప్రాణరక్షణ: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**ప్రజానావ, హైదరాబాద్:** రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంచి, ముందస్తు గుర్తింపు ద్వారా మహిళల ప్రాణాలను కాపాడాలన్న సంకల్పానికి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మద్దతు తెలిపారు. అంతర్జాతీయ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ చేపట్టిన 18వ 'పెయింట్ ది సిటీ పింక్' ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి లోక్‌భవన్ గులాబీ కాంతులతో వెలిగింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ పి. రఘురామ్‌తో కలిసి గవర్నర్ ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపారు. రొమ్ము ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు వ్యాధిని ముందుగానే గుర్తించేలా మహిళలను చైతన్యపరిచేందుకు డాక్టర్ రఘురామ్ చేస్తున్న కృషిని గవర్నర్ ప్రశంసించారు. లోక్‌భవన్ వరుసగా ఏడో ఏడాది ఈ ప్రచారంలో భాగస్వామ్యం కావడం విశేషం. చార్మినార్, బుద్ధ విగ్రహం, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల, ప్రసాద్స్ ఐమాక్స్, టీ–హబ్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, కిమ్స్ ఆసుపత్రి సహా హైదరాబాద్‌లోని ఎనిమిది ప్రముఖ కట్టడాలు గులాబీ వెలుగులతో మెరిశాయి. 'పెయింట్ ది సిటీ పింక్' కేవలం భవనాలను గులాబీ రంగులో వెలిగించడం మాత్రమే కాదని, ఆశ, ధైర్యాన్ని నింపుతూ రొమ్ము క్యాన్సర్‌పై మౌనాన్ని వీడి, ముందస్తు గుర్తింపుతో ప్రాణాలను కాపాడాలనే సందేశాన్ని చాటడమే లక్ష్యమని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ పి. రఘురామ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే హైదరాబాద్ వరుసగా 18 సంవత్సరాలుగా ఒకే రాత్రి ఇన్ని చారిత్రక కట్టడాలు, ప్రముఖ భవనాలను గులాబీ రంగులోకి మారుస్తున్న ఏకైక నగరమని పేర్కొన్నారు. 2009లో ప్రారంభమైన 'పెయింట్ ది సిటీ పింక్' ప్రచారం ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై ఉన్న భయాలు, అపోహలను తొలగిస్తూ ముందస్తు వైద్య పరీక్షల ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. రొమ్ములో ఏదైనా కొత్త మార్పు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముందస్తుగా వ్యాధిని గుర్తిస్తే చికిత్స ఫలితాలు మెరుగుపడటంతో పాటు ప్రాణాలను కాపాడే అవకాశం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.

# డిగ్రీ సెమిస్టర్ ఫీజులు తగ్గించాలి

- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట నిరసన
- సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

**ప్రజానావ, నారాయణపేట:** డిగ్రీ సెమిస్టర్ ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ కళాశాల కమిటీ ఆధ్వర్యంలో నారాయణపేటలోని చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ గత నాలుగైదేళ్లుగా డిగ్రీ సెమిస్టర్ ఫీజులను అధికంగా పెంచుతున్నారని ఆరోపించారు. కళాశాల పాలమూరు విశ్వవిద్యాలయం పరిధిలోకి రావడంతో విద్యార్థుల నుంచి అధిక సెమిస్టర్ ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి విశ్వవిద్యాలయం నుంచి ఎలాంటి నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. కళాశాలలో నెలకొన్న పలు సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే సెమిస్టర్ ఫీజులను తగ్గించడంతో పాటు విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శివ, శ్రీను, శ్రీకాంత్, చంద్రకళ, కళ్యాణితో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## దసరా సాంస్కృతిక శిక్షణ శిబిరానికి శ్రీకారం

- గోడపత్రికలు ఆవిష్కరించిన సీఐ రఘువీరారెడ్డి

**ప్రజానావ, వెల్దండ:** వెల్దండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విజయదశమి సెలవులను సద్వినియోగం చేసుకునేలా నిర్వహించనున్న దసరా సాంస్కృతిక శిక్షణ శిబిరం గోడపత్రికలను సీఐ ఈర్ల రఘువీరారెడ్డి ఆవిష్కరించారు. వందేమాతరం ఫౌండేషన్, ఐక్యత ఫౌండేషన్, మైవిలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్, కృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నారు. శిబిరంలో విద్యార్థులకు కోలాటం, శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, లాంగ్వేజ్ లాజిక్, లైఫ్ స్కిల్స్, నైతిక విలువలు, యోగా, బతుకమ్మ తదితర అంశాల్లో శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సెలవుల్లో విద్యార్థులకు ఉపయోగకరమైన శిక్షణతో పాటు సాంస్కృతిక అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ శిబిరం దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమలోని ప్రతిభ, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ల వ్యవస్థాపకులు దార్ల చిత్తరంజన్ దాస్, నిర్వాహకులు విజయ్‌కుమార్, రవికాంత్, రవళి, శ్రీరామ్, వసంత, పల్లవి తదితరులు పాల్గొన్నారు.



## డ్రాగన్‌తో చర్చలు సఫలీకతం అయ్యేనా?

భారత విమానయాన సంస్థలకు ప్రత్యామ్నాయ మార్గంగా జిన్‌జి యాంగ్ గగనతలాన్ని ఇచ్చేందుకు భారత్.. చైనాతో చర్చలు జరుపు తోందని అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ చైనా ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతోం దని వారు స్పష్టం చేశారు.జిన్‌పింగ్ ఢిల్లీ పర్యటనకు ముందు, చైనా సదరన్ ఎయిర్‌లైన్స్, ఆరు సంవత్సరాలుగా నిలిపివేసిన మార్గాన్ని పునరుద్ధరిస్తూ.. సెప్టెంబర్ 21 నుండి గ్వాంగ్‌జౌ–న్యూఢిల్లీ మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది.

భారత్ తో డ్రాగన్ మళ్లీ కలిసేందుకు సిద్ధమైంది. గత విద్వేషాలకు స్వస్తి పలుకుతూ భారత్ తో సుస్థిర బంధం ఏర్పరుచుకోవడానికి చైనా తహతహ లాడుతోంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్, తదనంతర పరిణామాలతో భారత్ విమానయాన సంస్థలకు పాకిస్తాన్ తన గగనతలాన్ని వసేసింది. దీంతో పాకిస్తాన్ మీదుగా వెళ్లాల్సిన భారత విమానాలు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఐరోపా, ఉత్తర అమెరికా వైపు వెళ్లే విమానాలు ఇతర మార్గాల్లో వెళ్తున్నాయి. దీనివల్ల ప్రయాణ సమయం, నిర్వహణ ఖర్చు పెరగడం వల్ల విమానయాన సంస్థలపై ఆర్థిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ గత ఏడాది కాలంగా ప్రత్యామ్నాయ మార్గాల్ని అన్వేషి స్తోంది. ఇందులో భాగంగా చైనాలోని హోటాన్ మీదుగా విమానాలు నడి పేందుకు అనుమతివ్వాలని డ్రాగన్ ను కోరుతోంది. అయితే ఇన్నాళ్లూ భారత్ చేసిన ఈ ప్రతిపాదనపై చైనా స్పందించడం లేదు. కానీ తాజాగా బ్రిక్స్ సదస్సు సందర్భంగా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ భారత్‌లో పర్య టించినప్పుడు.. ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చైనా అధికారులతో భారత అధికారులు చర్చలు జరుపుతున్నారు. భారత విమానయాన సంస్థలకు ప్రత్యామ్నాయ మార్గంగా జిన్‌జి యాంగ్ గగనతలాన్ని ఇచ్చేందుకు భారత్.. చైనాతో చర్చలు జరుపు తోందని అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ చైనా ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతోందని వారు స్పష్టం చేశారు. జిన్‌పింగ్ ఢిల్లీ పర్యటనకు ముందు, చైనా సదరన్ ఎయిర్‌లైన్స్, ఆరు సంవత్సరాలుగా నిలిపివేసిన మార్గాన్ని పునరుద్ధరిస్తూ.. సెప్టెంబర్ 21 నుండి గ్వాంగ్‌జౌ–న్యూఢిల్లీ మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. కోవిడ్ మహమ్మారి, భారత్–చైనా సరిహద్దు వెంబడి నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నంలో ఇదొక భాగం. భారత్–చైనా మధ్య పునఃప్రారంభించిన తొలి భారతీయ విమానయాన సంస్థ ఇండిగో. గత అక్టోబర్‌లో కోల్‌కతా–గ్వాంగ్‌జౌ మధ్య ఇండిగో సర్వీసులను పునఃప్రారంభిం చింది. నవంబర్‌లో ఢిల్లీ–గ్వాంగ్‌జౌ మధ్య దా భారత్–చైనా ప్రత్యక్ష విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించింది. ఆ తర్వాత ఎయిర్ ఇండియా ఫిబ్రవరి 1న ఢిల్లీ–షాంఘై సర్వీసులను నడిపింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు చైనా మీదుగా ఇతర దేశాలకు వెళ్లేందుకు భారత్ అనుమతులు కోరుతోంది. మరోవైపు భారత్–చైనా మధ్య సంబంధాలు గతంతో పోలిస్తే నేడు మెరుగ్గా ఉన్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అభిప్రాయపడ్డారు. సరిహద్దు సమస్యలు పరి ష్కారం కావడంతో ఇరు దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయన్నారు. సోమవారం న్యూయార్క్‌లో 'ఆసియా సొసైటీ'లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్ ఈ మేరకు స్పందించారు. "గతంతో పోలిస్తే ప్రస్తుతం సంబంధాలు మెరుగ్గా ఉన్నా యా అని నన్ను అడిగితే, 'అవును' అని అంటాను. 2024తో పోలిస్తే అవి మరింత మెరుగ్గా ఉన్నాయి." అన్నారు. 2020లో భారత్– చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత రెండు దేశాల మధ్య సాధారణ సం బంధాలు నిలిచిపోయాయని జైశంకర్ చెప్పారు. వాణిజ్యం కొనసాగి నప్పటికీ, అధికారిక రాకపోకలు, వీసా జారీ, విమాన సర్వీసులు మాత్రం ప్రభావితమయ్యాయని వివరించారు. ఈ క్రమంలోనే సరిహద్దు ఉద్రిక్తతలు పరిష్కారం కాగానే, సంబంధాలు మెరుగుపడటం సహజమని అన్నారు. మేము ఒక అత్యంత ప్రాథమిక సూత్రానికి వచ్చాం. సరిహద్దు పరిస్థితే మన సంబంధాల స్థితిని నిర్ణయిస్తుంది. సరిహద్దులో ఉద్రిక్తతలు కొనసాగుతుం డగా, సంబంధాలు మాత్రం సాధారణంగా ఉండాలని ఆశించడం సాధ్యం కాదు. సరిహద్దు పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటున్న కొద్దీ, మన సంబంధాలు కూడా సాధారణ స్థితికి వస్తాయి. సంబంధాలు సాధారణ స్థితికి రావడం వల్ల మన ఇద్దరికీ ప్రయోజనం చేరుతుంది. ఒక నిర్దిష్ట సమస్యపై మాత్రమే పూర్తిగా దృష్టి సారించి, తద్వారా నష్టపోయే పరిస్థితిని నేను కోరుకోను. నాకు అనులమైన పరిష్కారం దొరికితే, దానినే ఎంచుకోవ డానికి నేను ప్రాధాన్యం ఇస్తానన్నారు. ఇందులో భాగంగానే బ్రిక్స్ ( సదస్సు కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించడం వంటి పరిణామాలు జరిగాయి. మరోవైపు సీమాంతర ఉగ్రవాదమే భారత్‌కు ఉన్న ప్రధాన ఆందోళన అని విదేశాంగమంత్రి .జైశంకర్ అన్నారు. దశాబ్దాలుగా పొరుగు దేశం ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తోందని పాకిస్థాన్‌ను ఉద్దేశించి తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రపంచంలో మరే దేశం డా భారత్‌లా ఉగ్రవాద బాధితురాలిగా లేదన్నారు. కీలకమైన ఈ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు అర్థం చేసుకోకపోతే ద్వైపాక్షిక సంబంధాలపై కచ్చితంగా ప్రతిల ప్రభావం పడుతుందని జైశంకర్ హెచ్చరించారు. మరోవైపు భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారైతే ఇరు దేశాల సంబంధాలు మరింత మెరుగుపడతాయని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రంప్ హయాంలో అమెరికా–పాకిస్థాన్ మధ్య బంధం బలపడు తున్న నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏదిఏమైనా ఇరు దేశాల మధ్య చర్చలు ఫలించి గగనతలంపై విమానాల రాకపోకలు మళ్లీ పునఃప్రారంభం కావాలి. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఇతర సమస్యలపై కూడా అధికారులు దృష్టి సారించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారైతే ఇరు దేశాల సంబంధాలు మరింత మెరుగుపడతాయని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రంప్ హయాంలో అమెరికా–పాకిస్థాన్ మధ్య బంధం బలపడు తున్న నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఇతర సమస్యలపై కూడా అధికారులు దృష్టి సారించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# కృష్ణజింకలపై వేటగాళ్ల కన్ను

- కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో యథేచ్ఛగా వేట
- తుపాకులతో వన్యప్రాణుల వేట
- హైదరాబాద్‌కు తరలిస్తున్న మాంసం



**ప్రజానావ, నారాయణపేట:** కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో చెంగుచెంగున ఎగురుతూ కనువిందు చేసే కృష్ణజింకలు వేటగాళ్ల తూటాలకు బలవుతున్నాయి. చూడముచ్చటగా ఉండే జింకలు, లేడి పిల్లలపై తుపాకులు ఎక్కుపెట్టి వేటాడుతున్న ఘటనలు తరచూ వెలుగుచూస్తు న్నాయి. తాజాగా షాద్‌నగర్‌లో జింక మాంసంతో వేటగాళ్లు పోలీసులకు పట్టుబడిన ఘటన కలకలం రేపింది. నారాయణపేట జిల్లా కృష్ణా, మాగనూరు, మక్తల్, ఊట్కూరు, నర్వ, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లోని అడ వులు, నదీ పరిస రాల్లో జింకలు, నెమళ్లు, ఇతర వన్యప్రాణులు సంచరిస్తున్నా యి. పచ్చిక బయళ్లు, నీటి వసతి సమృద్ధిగా ఉండటం వీటి వృద్ధికి దోహదపడుతోంది. పులులు, చిరుతల సంఖ్య తగ్గడంతోనూ కొన్ని ప్రాంతాల్లో జింకల సంతతి పెరుగుతు న్నట్లు అధికారులు పేర్కొంటు న్నారు. వందల సంఖ్యలో సంచరించే కృష్ణజింకలపై వేటగాళ్ల కన్నుపడుతోంది. రాత్రి వేళల్లో తుపాకులతో వేటాడి జింక మాంసాన్ని హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు ఘటనలు వెల్లడిస్తున్నాయి.

### తుపాకులతో వేట.. 9 మందిపై కేసు


జింకలను ఎక్కువగా తుపాకులతోనే వేటాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెల 27న ఊట్కూరు మండ లం నిడుగుర్తి–లక్ష్మీ పల్లి శివారులో జింకలను వేటాడి మాంసాన్ని హైదరాబాద్‌కు తరలిస్తుండగా రంగారెడ్డి జిల్లా రాయికల్ టోల్‌ప్లాజా వద్ద ఎస్‌వోటీ పోలీసులు తనిఖీలు నిర్వహించి వేటగాళ్లను పట్టుకున్నారు. ఈ ఘటనలో ఊట్కూరు మండలానికి చెందిన ఎండీ రియాజ్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి లైసెన్స్‌డ్ రైఫిళ్లు, 19 తూటాలు, బైనాక్యులర్, కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు. మే నెలలో పట్టుబడిన మరో ఘటనలోనూ తుపాకులు ఉపయోగించినట్లు అధికారులు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన కొందరు యువకులు ప్రత్యేకంగా వేట కోసమే ఈ ప్రాంతాలకు వస్తున్నట్లు తెలుస్తోంది.

### పర్యవేక్షణపై ప్రశ్నలు

కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో తరచూ వేట జరుగుతున్నప్పటికీ వేటగాళ్లు ఎక్కువగా హైదరాబాద్ పరిధిలో పట్టుబడుతుండటం నిఘా లోపాలను ఎత్తిచూపు తోంది. అటవీ శాఖ అధికారులు నదీ పరివాహక ప్రాంతాల్లో సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టకపోవడంతో వన్యప్రాణులు వేటగాళ్ల చేతుల్లో బలవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. జింకలు పంటలను నాశనం చేస్తున్న కారణంగా కొందరు స్థానికులు వేట ఘటనలపై పోలీసులకు సమాచారం ఇవ్వడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అటవీ శాఖ ఉన్నతాధి కారులు స్పందించి కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో నిఘాను పెంచడంతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

### స్థానికులను మచ్చిక చేసుకుని..

ఈ ప్రాంతాల్లో జింకలు అధికంగా సంచరిస్తుం డటంతో హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, సంపన్న కుటుంబాలకు చెందిన కొందరు వేట కోసం కృష్ణా నది పరివాహక ప్రాంతాలను ఎంచుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్థానికులను మచ్చిక చేసుకుని, డబ్బు ఆశ చూపి వారి సహకారంతో జింకలు సంచరించే ప్రాంతాలను గుర్తిస్తున్నారు. వేటకు అనువైన ప్రదేశాల వివరాలు తెలుసుకుని రాత్రి వేళల్లో వేటాడి, ఉదయానికల్లా అక్కడి నుంచి వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. గతంలో మక్తల్ మండలం రుద్రసముద్రానికి చెందిన ఇద్దరు, ముష్టిపల్లికి చెందిన మరో వ్యక్తి వేటగాళ్లకు సహకరించిన కేసులో జైలుపాలయ్యారు. తాజా ఘటన లోనూ ఊట్కూరుకు చెందిన వ్యక్తి ఉండటం గమనార్హం.




## గ్రామాల్లోకి వస్తున్న భారీ కొండచిలువలు

**ప్రజానావ, మెదక్:** మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని పలు గ్రామాల్లోకి అడవుల నుంచి భారీ కొండచిలువలు, రక్త పింజర్లు వస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. లింగోజిగూడ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం సమీపంలో ఇళ్ల మధ్య రక్త పింజర సంచరించడంతో స్థానికులు ఆందోళన చెందారు. అలాగే సికింద్లాపూర్ గ్రామంలో బస్టాండ్ సమీపంలోని ఇళ్ల మధ్యకు మంగళవారం రాత్రి భారీ కొండచిలువ వచ్చింది. స్థానికులు అప్రమత్తమయ్యేలోపే అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. బుధవారం రూప్లాతండా గ్రామపంచాయతీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి తండాలో నివాస గృహాలకు సమీపంలోని పంట పొలాల్లోకి అడవి నుంచి భారీ కొండచిలువ రావడంతో రైతులు భయపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి కొండచిలువ లను పట్టుకుని జనావాసాలకు దూరంగా సురక్షిత ప్రాంతాల్లో వదిలిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## పురాతన ఆలయాల్లో అక్రమ తవ్వకాలు

- కోట్ల ఆశతో చరిత్ర ఆనవాళ్లకు గండం
- శిథిల దేవాలయాల్లో నిధుల వేట



**ప్రజానావ, నల్లగొండ:** కష్టపడకుండా రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావాలనే ఆశతో కొందరు శిథిలా వస్థలో ఉన్న వందల ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన దేవాలయాల్లో అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నా రు. జిల్లాలో కాకతీయులు, చోళులు, కందూరు నాడు చోడుల కాలంలో నిర్మించిన పురాతన ఆలయాలు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటిలో కొన్ని ఆలయా ల్లో నిత్య పూజలు జరుగుతుండగా, సుమారు 90 శాతం ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆయా ఆలయాల్లో అప్పటి రాజులు బంగారు నాణే లు, విలువైన మణులు, ఇతర సంపదను విగ్రహాల్లో, వాటి కింద, ఆలయ గోడల్లో భద్రపరిచి ఉంటారనే ప్రచారంతో కొందరు రాత్రివేళల్లో తవ్వకాలు చేస్తున్నా రు. దీంతో ఆయా ప్రాంతాల్లోని శిలాశాసనాలు, అరుదైన శిల్ప సంపద, చారిత్రక ఆనవాళ్లు ధ్వంసమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురాతన కట్టడాలను పరిరక్షించాల్సిన దేవాదాయ, పురావస్తు తదితర శాఖలు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనుముల గ్రామంలోని పురాతన ఆలయంలో తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో సంబంధిత వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చా మని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హాలియా ఎస్సై సాయిప్రశాంత్ తెలిపారు. అనుముల గ్రామంలోని 11వ శతాబ్దానికి చెందిన ప్రాచీన శివాలయంలో రెండు అరుదైన శివలింగాలు, మహాగణపతి విగ్రహాలు ఉన్నాయని, అక్కడ గత ఏడాది కాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పురావస్తు శాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి నాటి శిలాశాసనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే దామరచర్ల మండలంలోని వాడపల్లి స్వయంభూ ఆల యం, వీర్లపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయం, ఇరికిగూడెంలోని శివాలయంలోనూ తవ్వకాలు జరిగినట్లు సమాచారం. చారిత్రక సంపదకు నిలయమైన పురాతన ఆలయాలను కాపాడేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆలేరులో జోరుగా మొరం మట్టి దందా

- అనుమతులు లేకుండానే తవ్వకాలు
- టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



**ప్రజానావ, ఆలేరు:** ఆలేరు నియోజకవర్గం పరిధిలో మొరం, మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపు జోరుగా సాగు తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వపరంగా ఎలాంటి అనుమతులు పొందకుండానే జేసీబీలతో మొరం, మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ ఆదాయానికి గండి పడుతోంది. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకులు, గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల పాత్ర ఉందని, అందువల్లే అధికారులు సైతం చూసీచూ డనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణాలు, గ్రామాల్లో వెంచర్ల ఏర్పాటు, నిర్మాణాలు పెరుగుతుండటంతో మొరం, మట్టికి భారీగా డిమాండ్ ఏర్పడింది. ప్రైవేట్ భూముల నుంచి సైతం మొరం, మట్టిని తరలించాలంటే పంచాయతీ, రెవెన్యూ, గనుల శాఖల నుంచి అనుమతులు పొందాల్సి ఉన్నప్పటికీ, నిబంధనలను పట్టించుకోకుండా తవ్వకాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఆలేరు నియోజకవర్గంలోని బొమ్మలరామారం మండలం హైదరాబాద్ నగరానికి సరిహద్దుగా ఉండటంతో పాటు ఆలేరు, తుర్కపల్లి, యాదగిరిగుట్ట, రాజపేట, మోటకొం డూరు, ఆత్మకూరు మండలాలు యాదాద్రి చుట్టుపక్కల విస్తరించి ఉన్నాయి. ఆలేరు, యాదగిరిగుట్ట మండలాల మీదుగా హైదరాబాద్–చరంగల్ జాతీయ రహదారి ఉండటంతో ఈ ప్రాంతంలోని భూములకు భారీగా డిమాండ్ ఏర్పడింది. దీంతో పెద్ద సంఖ్యలో వెంచర్లు వెలుస్తుండగా, వాటిలోకి నిత్యం టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. కొన్ని చెరువులు, కుంటల నుంచి మొరం, మట్టిని తవ్వి తరలించడంతో ఏర్పడిన లోతైన గుంతలు వర్షాకాలంలో నీటితో నిండిపోతున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల నుంచి తరలించే మట్టి పరిమాణాన్ని బట్టి రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. క్యూబిక్ మీటర్‌కు రూ.30 చొప్పున గనుల శాఖకు రాయల్టీ చెల్లించాలి. 15 అడుగుల లోతు వరకు మట్టిని తవ్వితే ఎకరాకు సుమారు 22 వేల క్యూబిక్ మీటర్ల మట్టి లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఎకరాకు లక్షల రూపాయల మేర ప్రభుత్వానికి రాయల్టీ ఆదాయం రావాల్సి ఉండగా, అక్రమ తవ్వకాల కారణంగా ఆ ఆదాయానికి గండి పడుతోందనే విమర్శలు ఉన్నాయి. అనుమతులు లేకుండా మొరం, ఇతర మట్టిని తవ్వి తరలిస్తున్న వారి సమాచారాన్ని అధికారులకు అందించాలని ఆలేరు తహసీల్దారు వి.ఆంజనేయులు కోరారు. అక్రమ తవ్వకాలు, తరలింపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, మట్టిని తవ్వే యంత్రాలతో పాటు తరలింపునకు ఉపయోగించే వాహనాలను సీజ్ చేస్తామని ఆయన తెలిపారు.

## గజ్వేల్‌లో పాల ఏటీఎం వినూత్న ప్రయోగం




**ప్రజానావ, గజ్వేల్:** డబ్బులు ఇచ్చే ఏటీఎంలు, టికెట్లు అందించే మిషన్లు సాధారణంగా కనిపిస్తుంటాయి. కానీ గజ్వేల్‌లో మాత్రం పాలు అందించే ఏటీఎం అందుబాటులోకి వచ్చింది. హోటల్ మేనేజ్‌మెంట్ చదివిన గజ్వేల్ యువకుడు మల్లేపల్లి సందీప్ వినూత్న ఆలోచనతో పాల ఏటీఎంను ఏర్పాటు చేశారు. రైతుల నుంచి సేకరించిన పాలను ఆటో ట్రాలీలో ఏర్పాటు చేసిన ఏటీఎం ద్వారా వినియోగదారులకు విక్రయిస్తున్నారు. సెన్సార్ సాంకేతికతతో పనిచేసే ఈ పాల ఏటీఎంలో వినియోగదారులు ముందుగా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, అవసరమైన పాల పరిమాణాన్ని ఎంచుకోవాలి. అనంతరం స్టీల్‌సీసాల్లో ఏటీఎం నుంచి పాలు అందుతాయి. ఈ విధానంతో పరిశుభ్రమైన, తాజా పాలను నేరుగా వినియోగదారులకు అందిస్తున్నట్లు సందీప్ తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 300 లీటర్ల వరకు పాలను విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఈ పాల ఏటీఎం యంత్రం ఏర్పాటుకు రూ.3 లక్షల వరకు ఖర్చు అయినట్లు వివరించారు.

## జైల్లో పరిచయం.. బయటకొచ్చాక చోరీలు




**ప్రజానావ, తాండూరు:** జైల్లో ఒకరికొకరు పరిచయమయ్యారు.. విడుద లైన తర్వాత ముగ్గురూ కలిసి చోరీలకు పాల్పడి మళ్లీ కటకటాలపాలయ్యారు. తాండూరు పట్టణంలో వరుసగా జరిగిన చోరీ కేసులను పట్టణ పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును స్వాధీనం చేసుకు న్నారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్ కు తరలించారు. కేసు వివరాల ను తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, పట్టణ సీఐ పరమేశ్వర్‌గౌడ్ వెల్లడించారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ పరిధి గాంధీనగర్‌లో వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవించే అబ్దుల్ జహీర్ ఈ నెల 13న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి కర్ణాటక రాష్ట్రంలోని సేడంకు వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగలగొట్టి రెండు తులాల బంగారు నెక్లెస్, 39 తులాల వెండి ఆభరణా లు, కొంత నగదును అపహరించారు. అదే రోజు మరో ఇంట్లోనూ బంగారు నెక్లెస్, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. వరుస చోరీలతో అప్రమత్తమైన క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. మంగళవారం తాండూరు బస్టాండ్ వద్ద అనుమానాస్ప దంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా వరుస చోరీల గుట్టు రట్టయింది. విచారణలో మరికొన్ని చోరీలు కూడా వెలుగులోకి వచ్చాయి. తాండూరు మిత్రానగర్‌లో టీ కొట్టు నిర్వహించే వ్యక్తి ఇంట్లో ఈ నెల 16న 10 తులాల బంగారం, నగదును చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించారు. అలాగే 2025 నవంబరులో రాజీవ్ కాలనీలో ఓ ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని మూడు తులాల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండిని అపహరించినట్లు పోలీ సుల విచారణలో వెల్లడైంది. మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండలానికి చెందిన ఆదుల బాబు ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా, వికారాబాద్ జిల్లా యాలాల మండలం కమాల్‌పూర్‌కు చెందిన బోయిని శ్రీకాంత్ ఆటో డ్రైవర్‌గా, తాండూరు మారికా ంబ కాలనీకి చెందిన కె. ప్రవీణ్ ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తున్నారు. వీరు ముగ్గురూ గతంలో వేర్వేరు కేసుల్లో జైలుకు వెళ్లిన సమయంలో ఒకరికొ కరు పరిచయమయ్యారు. జైలు నుంచి విడుదలైన అనంత రం ఆ పరిచయంతో కలిసి చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపా రు. వారి వద్ద నుంచి రూ.లక్ష నగదు, ఎనిమిది తులా ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న పోలీ సులు కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.



## ముఖ్యమంత్రి జిల్లా పర్యటన విజయవంతం

**పోలీసు అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ అభినందనలు**

**ప్రజానావ, సిరిసిల్ల :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లతో పర్యటన విజయవంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ సందర్భంగా బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరినీ జిల్లా ఎస్పీ హృదయపూర్వకంగా అభినందించారు. విధుల నిర్వహణలో సమన్వయంతో, అంకితభావంతో పనిచేసిన సిబ్బందిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి రాజన్న ప్రసాదం

- **ముఖ్యమంత్రిని కలిసిన దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు**
- **శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేత**



**ప్రజానావ వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ హనుమంతరావు (ఐఏఎస్) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామివారి శేషవస్త్రాన్ని ముఖ్యమంత్రికి అందజేసి ఆశీర్వచనాలు తెలిపారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి ముఖ్యమంత్రికి స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ వివరాలను వేములవాడ దేవస్థానం పీఆర్వో పెరిక శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

## భీమేశ్వర స్వామిని దర్శించుకున్న ఆదిలాబాద్ ఎస్పీ

- **కోడె మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు**
- **శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేత**



**ప్రజానావ వేములవాడ:** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ (ఐపీఎస్) బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఎస్పీకి అర్చకులు, వేద పండితులు స్వామివారి స్వస్తివచనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం భీమేశ్వర స్వామివారికి ఎస్పీ కోడె మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారి మండపంలో అర్చకులు, వేద పండితులు ఎస్పీకి వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పీఆర్వో పెరుక శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు నూగురి నరేందర్ ఎస్పీకి స్వామివారి శేషవస్త్రంతో పాటు లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.

## ఘనంగా ఋషి పంచమి వేడుకలు ప్రారంభం

- **నాలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు**
- **దుర్గాదేవి, కాలుబాబా, పాచుబాబాలకు ప్రత్యేక పూజలు**



**ప్రజానావ, ఇంద్రవెల్లి:** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ఎమాయికుంటా, అందునాయకండా గ్రామాల్లో మథురా సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఋషి పంచమి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి మథురా సమాజానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో దుర్గాదేవి, కాలుబాబా, పాచుబాబాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాంసింగ్, సురేష్ మహారాజ్‌ల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఉత్సవాల సందర్భంగా మథురా సమాజ సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా యువకులు ఉత్సాహంగా పాల్గొని పోటాపోటీగా సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఋషి పంచమి వేడుకల ప్రారంభ కార్యక్రమాల్లో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, భారాస నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జాన్సన్ నాయక్ పాల్గొన్నారు. ఎమాయికుంటా, అందునాయకండా గ్రామాల్లోని ఆలయాలను సందర్శించిన వారు దుర్గాదేవి, కాలుబాబా, పాచుబాబాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు.








# ఉద్యోగులే ప్రభుత్వానికి ముఖచిత్రం

- **పేదలకు సంక్షేమ ఫలాలు అందించడంలో కీలక పాత్ర**
- **కరీంనగర్ ఐడీఓసీ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి**

**ప్రజానావ, కరీంనగర్:** తెలంగాణలో పూర్తికాలపు ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో కలిపి 10.5 లక్షల మంది ఉద్యోగులు నాలుగు కోట్ల మంది ప్రజలకు సేవలందిస్తున్నారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర జనాభాలో కేవలం మూడు శాతం మంది ఉద్యోగులు 95 శాతం ప్రజలకు సేవలు అందించడం ఎంతో శ్రమ, నిబద్ధతతో కూడుకున్న విషయమని పేర్కొన్నారు. ఉద్యోగులంతా అంకితభావంతో పనిచేసినప్పుడే పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు సమర్థవంతంగా చేరుతాయని చెప్పారు. కరీంనగర్‌లో నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన సీఎం.. కలెక్టరేట్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు పేదవాడికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా ఉండాలని అన్నారు. సమస్యలు, బాధలతో కార్యాలయాలకు వచ్చే నిరుపేదలను కుటుంబ సభ్యులుగా భావించి సేవలందించాలని ఉద్యోగులను కోరారు. సంక్షేమ పథకాలను పేదలకు చేరవేయడంలో ప్రభుత్వ ఉద్యోగులే కీలక ప్రతినిధులని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి సహా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చినా, చెడ్డ పేరు వచ్చినా దాని వెనుక ఉద్యోగుల పనితీరు ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ నిర్ణయాలు, చట్టాలు, అనుమతులు, సంక్షేమ పథకాల ఫలితాలను చేరవేయడంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా మొదటి తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని, ప్రమోషన్లు, బదిలీలు, పదవీ విరమణ ప్రయోజనాలు, పీఆర్సీ, ఇతర ప్రయోజనాలు, ఆరోగ్య భద్రతకు సంబంధించిన అంశాలను వీలైనంత వరకు పరిష్కరిస్తున్నామని చెప్పారు. అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని చెప్పడం లేదని, ఇంకా సమస్యలు ఉన్నాయని స్పష్టం చేస్తూ.. ప్రజలకు సేవలందిస్తూనే ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించుకుందామని అన్నారు. కరీంనగర్ జిల్లాలో రూ.944 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించామని, మరికొన్ని పనులకు శంకుస్థాపనలు చేశామని సీఎం తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.840 కోట్ల నిధులు సాధించామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరిస్తే ముఖ్యమంత్రిగా అభినందించడంలో ఎలాంటి శషభిషలు లేవన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, మిగిలిన సమయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వందల కోట్ల రూపాయలతో ప్రాజెక్టులు నిర్మించినా కేంద్ర ప్రభుత్వ అనుమతులు లేకపోతే వాటి ప్రయోజనం ప్రజలకు అందదన్నారు. అభివృద్ధి కోసం కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే మార్గంలో కంటోన్మెంట్ ప్రాంతం అతిపెద్ద ప్రతిబంధకంగా మారిందని సీఎం వివరించారు. గతంలో పలువురు నాయకులు ప్రయత్నించినా పరిష్కారం కాని ఈ సమస్యపై తాను అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి వివరించానని గుర్తుచేశారు. ఆరు నెలల్లోనే కంటోన్మెంట్ పరిధిలో దాదాపు 170 ఎకరాల భూమిని రాష్ట్రానికి అందించారని తెలిపారు. కంటోన్మెంట్ ప్రాంతంలో దాదాపు రూ.5 వేల కోట్లతో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్‌ను ఏడాదిలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. బేగంపేట విమానాశ్రయం రన్‌వే కింద నుంచి రహదారి నిర్మించేందుకు కూడా అనుమతులు సాధించామని తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో రాజకీయ సిద్ధాంతాలు వేరైనా పరస్పర సహకారంతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాలపై మరోసారి జిల్లాకు వచ్చి సమగ్రంగా సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఆహార భద్రత పథకాల ఫలాలు

- **రేషన్, పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలి**
- **అధికారులకు ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశం**

**ప్రజానావ, ఆదిలాబాద్:** జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం–2013ను పకడ్బందీగా అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్, పౌష్టికాహారం, ఆహార భద్రత పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెండు రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న గుడ్ల నాణ్యతను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతి గృహాలు, రేషన్ దుకాణాల్లో నేమ్‌బోర్డులు ఏర్పాటు చేసి సంబంధిత బాధ్యుల వివరాలు, ఫిర్యాదు చేసే విధానం, టోల్‌ఫ్రీ నంబర్లను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల హాస్టళ్లలో నిర్వహించిన తనిఖీల సందర్భంగా భోజన వేళలు, మెనూ అమలు, వంటగది పరిశుభ్రత, వంట సామగ్రి నిర్వహణ, అధికారుల పర్యవేక్షణకు సంబంధించి కొన్ని లోపాలు గుర్తించినట్లు తెలిపారు. ఫుడ్ కమిషన్ సభ్యుడు ఒరగంటి ఆనంద్ మాట్లాడుతూ ఆహార భద్రత చట్టం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం పొందే హక్కు ఉందన్నారు. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు అవసరమైన వైద్య సేవలు, ప్రత్యేక సంరక్షణ అందేలా చూడాలని సూచించారు. అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు బాలామృతం, పాలు, గుడ్లు, పాఠశాల విద్యార్థులకు నిర్దేశిత మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు. పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహించిన బాధ్యులపై చర్యలు తీసుకునే అధికారం ఫుడ్ కమిషన్‌కు ఉందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి తనిఖీల్లో గుర్తించిన లోపాలను తక్షణమే సరిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు.

## అంగన్‌వాడీ గుడ్లలోనూ కోతలు

- **నిబంధనలకు విరుద్ధంగా చిన్నసైజు గుడ్ల సరఫరా**
- **అధికారుల పర్యవేక్షణ లోపంతో గుత్తేదారుల ఇష్టారాజ్యం**



**ప్రజానావ, తాండూర్:** అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గుడ్లను పంపిణీ చేస్తోంది. అయితే అధికారుల పర్యవేక్షణ లోపంతో గుత్తేదార్లు నిబంధనలను పట్టించుకోకుండా చిన్న పరిమాణం కలిగిన గుడ్లను సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన పోషకాహార లక్ష్యం నీరుగారుతోందని అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే ఒక్కో గుడ్డు 50 గ్రాముల బరువు ఉండాలి. ఒక ట్రేలో సుమారు 30 గుడ్లు ఉంటాయి. ట్రే బరువును మినహాయిస్తే గుడ్ల బరువు కిలోన్నర ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం కిలో వంద గ్రాముల వరకు మాత్రమే ఉంటోందని సిబ్బంది చెబుతున్నారు. అంటే ఒక్కో ట్రేలో సుమారు 400 గ్రాముల బరువు తక్కువగా ఉంటోంది. గుడ్డు రంగు మారినా, దెబ్బతిన్నా దాని స్థానంలో మరో గుడ్డును అందించాల్సి ఉన్నప్పటికీ అలా చేయడం లేదని ఆరోపిస్తున్నారు. పెద్ద సైజు గుడ్లను బయట వ్యాపారులకు అధిక ధరకు విక్రయిస్తూ, తక్కువ ధరకు లభించే చిన్నసైజు గుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారని వారు అంటున్నారు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందాల్సిన పోషకాహారం పరిమాణం తగ్గిపోతోందని పేర్కొంటున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు గుడ్ల సరఫరాను తనిఖీ చేసి నిబంధనల మేరకు ఉన్నాయో లేదో పరిశీలించాల్సి ఉన్నా పర్యవేక్షణ కొరవడటంతో గుత్తేదార్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

### అడిగితే పొంతన లేని సమాధానాలు

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన గుడ్లు చిన్నవిగా ఉన్నాయని సరఫరాదారులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని కార్యకర్తలు, సిబ్బంది వాపోతున్నారు. కనీసం వాహనం నుంచి గుడ్లను దించి తూకం వేసే అవకాశం కూడా ఇవ్వడం లేదని చెబుతున్నారు. ప్రశ్నిస్తే ఇప్పటికే ఉన్నతాధికారుల సమక్షంలో తూకం వేశామని సరఫరాదారులు సమాధానం ఇస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్లు నిబంధనల ప్రకారం 50 గ్రాముల బరువుతో ఉండేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యత, పరిమాణంపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది కోరుతున్నారు.

# రెండుపడక గదుల ఇళ్ల పంపిణీకి కదలిక

- **త్వరలో లబ్ధిదారులకు అందజేత**
- **అర్హుల ఎంపిక ప్రక్రియ వేగవంతం**



**ప్రజానావ, వరంగల్:** ఇల్లులేని నిరుపేదలకు సొంతింటి నీడ కల్పించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం చేపట్టిన రెండుపడక గదుల ఇళ్ల నిర్మాణ పథకం నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోయింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయడంతో రెండుపడక గదుల ఇళ్ల పంపిణీ ప్రక్రియకు బ్రేక్ పడింది. తాజాగా వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో నిర్మించిన రెండుపడక గదుల ఇళ్లను త్వరలో పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే కొండా సురేఖ ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే అర్హుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. గత ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 5,790 రెండుపడక గదుల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించింది. ఇందులో 3,846 ఇళ్ల నిర్మాణానికి మాత్రమే టెండర్లు పూర్తికాగా, ఇప్పటివరకు 2,237 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

### అసంపూర్తి నిర్మాణాలు

రూ.వందల కోట్ల వ్యయంతో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో పలుచోట్ల అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. దూపకుంటలో మొత్తం 2 వేల ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోగా, ఇప్పటివరకు 900 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. నిధుల కొరతతో అనేక ఇళ్ల పిల్లర్ల, స్లాబ్, ప్లాస్టరింగ్ దశల్లోనే నిలిచిపోయాయి. అయితే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణాలు ఏ దశలో ఉన్నా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రక్షణ చర్యలు లేకపోవడంతో ఇప్పటికే పలుచోట్ల తలుపులు, కిటికీలు, నీటి పైపులు చోరీకి గురయ్యాయి. నిర్వహణ లేక చెట్లు, పొదలు పెరిగి ఇళ్లలోకి చొచ్చుకొస్తున్నాయి. మరోవైపు గత ప్రభుత్వం దేశాయిపేటలో నిర్మించిన రెండుపడక గదుల ఇళ్లను జర్నలిస్టులకు కేటాయిస్తామని ప్రకటించింది. ప్రస్తుతం ఆ ఇళ్లకు ఏ ప్రాతిపదికన లబ్ధిదారులను ఎంపిక చేస్తారనే అంశంపై స్పష్టత లేకపోవడంతో సందిగ్ధత నెలకొంది.

### పారదర్శకంగా అర్హుల ఎంపిక

ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారులను ఎల్1, ఎల్2, ఎల్3 జాబితాల్లో నమోదు చేశారు. ఎల్1 జాబితాలో ఉన్నవారికి ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నారు. ఇల్లు, నిర్ణీత స్థలం లేని ఎల్2 జాబితాలోని లబ్ధిదారులకు రెండుపడక గదుల ఇళ్లను కేటాయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పేదలకు నిర్మించిన ఇళ్ల కేటాయింపులో రాజకీయ జోక్యానికి తావులేకుండా అర్హతను ప్రామాణికంగా తీసుకుని పారదర్శకంగా డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. అర్హులను పక్కనబెట్టి తమకు అనుకూలమైన వారికి ఇళ్ల కేటాయిస్తున్నారని ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే ఆరోపణలు చేస్తున్నాయి.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**బొమ్మన్దేవుపల్లి కూడలి వద్ద ఘటన**

**ప్రజానావ, నిజామాబాద్:** ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నస్రుల్లాబాద్‌లో చోటుచేసుకుంది. బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. నస్రుల్లాబాద్ మండలం కంశెట్టిపల్లి గ్రామానికి చెందిన గోసంగి లచ్చిరామ్ (45) రోజువారీ కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. బుధవారం రాత్రి నస్రుల్లాబాద్‌లో పాత ఇనుప సామగ్రిని విక్రయించిన అనంతరం సైకిల్‌పై స్వగ్రామమైన కంశెట్టిపల్లికి బయలుదేరారు. ఈ క్రమంలో నిజామాబాద్ నుంచి బాన్సువాడకు వెళ్తున్న బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నస్రుల్లాబాద్‌లోని 765డీ జాతీయ రహదారిపై బొమ్మన్దేవుపల్లి ప్రధాన కూడలి వద్ద లచ్చిరామ్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లచ్చిరామ్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

## తెలంగాణ తిరుమలలో ప్రముఖుల ప్రత్యేక పూజలు

- **శ్రీవారిని దర్శించుకున్న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి**

**ప్రజానావ, బీర్కూర్:** బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవాలయాన్ని రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి వచ్చిన ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు అప్పారావు, దేవిసింగ్, మైలారం సొసైటీ ఇన్‌ఛార్జి హన్మంతురావు, నర్సరాజు, సాయిబాబా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బ్లూ డ్రమ్ హత్య కేసులో భార్య, ప్రియుడు దోషులు

- 13 నెలల్లో విచారణ పూర్తి
- 126 సార్లు వాదనలు, 22 మందికి పైగా సాక్షుల విచారణ
- సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో తీర్పు



**మీరట్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ 'బ్లూ డ్రమ్' హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మృతుడు సౌరభ్ రాజ్‌పుత్ భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాను మీరట్ జిల్లా కోర్టు హత్య, సాక్ష్యాల ధ్వంసం, నేరపూరిత కుట్రకు సంబంధించిన అభియోగాల్లో దోషులుగా నిర్ధారించింది. సుమారు 13 నెలల పాటు సాగిన విచారణలో 126 సార్లు వాదనలు జరగగా, 22 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలను కోర్టు నమోదు చేసింది. ప్రస్తుతం జైలులో ఉన్న ముస్కాన్, సాహిల్‌ను వారి భద్రత, ఇతర కారణాల దృష్ట్యా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు విచారించింది. తీర్పు వెలువడే ముందు ముస్కాన్ మూడు రోజులుగా జైలులో ప్రార్థనలు చేస్తూ ఉన్నట్లు అధికారులు తెలిపారు. సాహిల్ తోటి ఖైదీలతో మాట్లాడకుండా మౌనంగా ఉన్నట్లు వెల్లడించారు. తీర్పు సందర్భంగా న్యాయమూర్తి నిందితులతో మాట్లాడినట్లు సమాచారం. ఈ హత్య సమాజంలో భయాందోళనలు కలిగించిందని కోర్టు పేర్కొంది. సౌరభ్ హత్యలో ముస్కాన్, సాహిల్ పాత్రను ఆధారాలతో నిర్ధారించిన కోర్టు వారిద్దరినీ దోషులుగా తేల్చింది. అయితే శిక్ష ఎంత అన్నది తదుపరి విచారణలో ఖరారు చేయనుంది. ఈ కేసులో శిక్షపై వాదనలు పూర్తయ్యాక తీర్పు వెలువడనుంది. కాగా, మాజీ నేవీ అధికారి, మర్చంట్ నేవీ ఉద్యోగి అయిన 29 ఏళ్ల సౌరభ్ రాజ్‌పుత్ హత్యకు గురైన ఘటన 2025లో వెలుగులోకి వచ్చింది. పోలీసుల దర్యాప్తు ప్రకారం ముస్కాన్, సాహిల్ కలిసి సౌరభ్‌ను హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా చేసి సిమెంట్‌తో నింపిన పెద్ద నీలి రంగు ప్లాస్టిక్ డ్రమ్‌లో దాచారు. డ్రమ్ నుంచి దుర్వాసన రావడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు నిందితులను అరెస్టు చేసి కేసును విచారించారు. సౌరభ్, ముస్కాన్ దంపతుల మధ్య సాహిల్ సంబంధం ఏర్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. గతంలో కలిసి చదువుకున్న ముస్కాన్, సాహిల్ 2019లో వాట్సాప్ ద్వారా మళ్లీ పరిచయమ య్యారని, ఆ తర్వాత వారి మధ్య సన్నిహిత సంబం ధం ఏర్పడిం దని దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో సౌరభ్ తమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన ముస్కాన్, సాహిల్ అతడిని హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లు ప్రాసిక్యూషన్ వాదించింది. అనంతరం హత్య చేసి మృతదేహాన్ని నీలి డ్రమ్‌లో సిమెంట్‌తో కప్పి దాచినట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది. 126 విచారణలు, 22 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలు, విస్తృత ఆధారాల పరిశీలన అనంతరం కోర్టు తాజాగా ఇద్దరినీ దోషులుగా నిర్ధారించింది.

# ఈఫిల్ టవర్ చీఫ్ వైదొలగనున్న వేళ


- మహిళా సిబ్బందిని విధుల నుంచి తప్పించిన ఘటనపై విచారణ
- నిర్వహణ లోపాలే కారణమని నిర్ధారణ



**పారిస్:** హిందూ మత గురువులు ఈఫిల్ టవర్‌ను సందర్శించిన సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను విధుల నుంచి తప్పించిన ఘటనపై వివాదం కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనను ఖండిస్తూ మహిళా సిబ్బంది ఆందోళనకు దిగడంతో సెప్టెంబర్ ఏడో తేదీన ఈఫిల్ టవర్‌ను మూసివేశారు. అనంతరం చేపట్టిన విచారణలో ఘటనకు నిర్వహణ లోపాలే కారణమని తేల్చారు. ఈ వైఫల్యాల కారణంగానే మహిళా సిబ్బంది ధర్నాకు దిగినట్లు ఈఫిల్ టవర్ భద్రతా సంస్థ తన ప్రకటనలో పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఈఫిల్ టవర్ నిర్వహణ సంస్థకు చీఫ్‌గా వ్యవహరిస్తున్న పాట్రిక్ బ్రాంకోరువియో ఈ ఏడాది చివర్లో తన పదవి నుంచి వైదొలగనున్నట్లు తెలుస్తోంది. ఆయన 2018లో ఈఫిల్ టవర్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రతి ఏడాది సుమారు 70 లక్షల మంది పర్యాటకులు ఈఫిల్ టవర్‌ను సందర్శిస్తుంటారు. తాజా ఘటనపై ఓ కార్మిక నేత స్పందిస్తూ మహిళా సిబ్బందిపై విధించిన నిర్వహణ ఆంక్షలు ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. బోచసన్వాసి శ్రీ అక్షర్ పురుషోత్తమ్ స్వామినారాయణ్ సంస్థకు చెందిన గ్రూపు సభ్యులు ఈఫిల్ టవర్‌ను సందర్శించిన సమయంలో అక్కడ విధుల్లో ఉన్న మహిళా సిబ్బందిని తప్పించడంతో ఈ వివాదం ప్రారంభమైన విషయం తెలిసిందే.

# హిందూ-ముస్లింల ఐక్యతతోనే దేశం బలోపేతం


- ముస్లింలంతా రాముడు, కృష్ణుడిని పూర్వీకులుగా గుర్తించాలి
- యోగాగురు రాందేవ్ వివాదాస్పద వ్యాఖ్యలు



**మధుర:** యోగాగురు బాబా రాందేవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారతదేశంలోని ముస్లిం లంతా మతం మారినవారేనని, శ్రీరాముడు, శ్రీకృష్ణుడితో పాటు ప్రాచీన రుషులు తమ పూర్వీకులేనని వారు గుర్తించాలని అన్నారు. బుధవారం మధురలో ఓ వార్తా సంస్థతో మాట్లాడిన ఆయన.. మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. దేశంలోని ఏ రాజకీయ పార్టీ కూడా ముస్లింలకు స్వతంత్ర రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరుకోవడం లేదని, వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ఒవైసీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రాందేవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత ముస్లిం సోదరులంతా తమ ప్రాచీన రుషులు, శ్రీరామకృష్ణుల పూర్వీకులేనని గుర్తించాలని రాందేవ్ అన్నారు. తమ మూలాలతో అనుసంధానమైతే వారు ఎన్నటికీ బలహీనంగా భావించరని పేర్కొన్నారు. హిందూ-ముస్లింలు ఐక్యంగా ఉంటేనే దేశం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇదే తరహాలో గతంలో బీజేపీ మైనారిటీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖీ, ఉత్తరప్రదేశ్ మంత్రి ఆనంద్ స్వరూప్ శుక్లా కూడా వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన 'శివుడు పేదల దేవుడు.. రాముడు ధనికుల దేవుడు' అనే వ్యాఖ్యల పైనా రాందేవ్ స్పందించారు. సనాతన ధర్మంలో కులం, వర్గం పేరుతో కొందరు విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. రాముడు, కృష్ణుడు, శివుడు, హనుమంతుడు అందరూ ఒక్కటేనని, దేవుడి పేరుతో గందరగోళం సృష్టించవద్దని ఆయన కోరారు.

# మార్నింగ్ వాకర్‌పై ఏనుగు దాడి

- 60 ఏళ్ల వ్యక్తిని తొక్కి చంపిన ఏనుగు
- కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం



**బెంగళూరు:** కర్ణాటక రాజధాని బెంగళూరులో ఏనుగు దాడిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. రోడ్డుపై మార్నింగ్ వాక్ చేస్తున్న 60 ఏళ్ల నాగరాజ్‌పై అడవి నుంచి తప్పించుకుని వచ్చిన ఏనుగు దాడి చేసి తొక్కి చంపింది. సెప్టెంబర్ 28న ఉదయం 5 గంటల సమయంలో బెంగళూరు శివారు ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన ఏనుగు రోడ్డుపై వెళ్తున్న నాగరాజ్‌పై దాడి చేసి తన పాదాలతో తొక్కడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ మంత్రి రామలింగారెడ్డి వెంటనే రాజరాజేశ్వరి ఆసుపత్రికి చేరుకుని నాగరాజ్ కుటుంబసభ్యులను పరామర్శిం చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మానవతా దృక్పథంతో రూ.20 లక్షల పరిహారం అందజేస్తామని ప్రకటించారు. కొత్త రోడ్డు నిర్మించినప్పటి నుంచి ఆ ప్రాంతంలో ఏనుగుల సంచారం పెరిగిందని మంత్రి తెలిపారు. దాడికి పాల్పడిన ఏనుగును గుర్తించి అడవిలోకి తరిమేందుకు అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని వివరించారు. మరోవైపు ఏనుగు కదలికలను గుర్తించి పట్టుకునేందుకు సుమారు 100 మంది సిబ్బందితో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. దుబారే శిబిరానికి చెందిన శిక్షణ పొందిన ఏనుగులను కూడా ఈ ఆపరేషన్‌లో వినియోగిస్తున్నారు. ఏనుగు బన్నెర ఘట్ట అటవీ డివిజన్ పరిధిని దాటి మరింత ముందుకు వెళ్లకుండా అటవీ శాఖ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. డ్రోన్లతో నిఘాను పెంచారు. బీఎం కావల్ ప్రాంతంలో ఏనుగును గుర్తించినట్లు అటవీ శాఖ అధికారి చక్రపాణి తెలిపారు. ఏనుగును పట్టుకు నేందుకు మూడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగినట్లు చెప్పారు. ఏనుగు సంచరిస్తున్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. బన్నెరఘట్ట అటవీ విభాగం పరిధిని దాటి ఏనుగులు జనావాసాల్లోకి రాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కాగా, నాగరాజ్‌పై ఏనుగు దాడి చేసిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.



# ఆరేళ్ల తర్వాత తెరుచుకున్న గుండిచా ఆలయం

- కరోనా సమయంలో మూసివేత
- మళ్లీ భక్తులకు దర్శనం
- తొలి రోజే భారీగా తరలివచ్చిన భక్తులు

**పూరీ:** ఒడిశాలోని ప్రముఖ శ్రీ గుండిచా దేవాలయం ఆరేళ్ల తర్వాత భక్తుల కోసం తెరుచుకుంది. కరోనా సమయంలో మూసివేసిన ఈ ఆలయం ఇన్నాళ్లకు మళ్లీ అందుబాటులోకి రావడంతో భక్తులు, సేవకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయాన్ని జగన్నాథుడి జన్మస్థలంగా భావిస్తారు. అందుకే దీనిని 'జన్మవేది' అని కూడా పిలుస్తారు. 2020లో కరోనా వ్యాప్తి సమయంలో ఆలయాన్ని మూసివేశారు. అనంతరం బుధవారం ఆలయాన్ని భక్తుల దర్శనార్థం పునఃప్రారంభించారు. ఆలయం తెరవడానికి ముందు అర్చకులు ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 7.45 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. శ్రీ గుండిచా ఆలయాన్ని పూరీ జగన్నాథుడి జన్మవేదిగా భావిస్తూ భక్తులు అత్యంత పవిత్రంగా దర్శించుకుంటారు. ఆలయం తెరిచిన తొలి రోజే భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం, పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పూరీ జగన్నాథుడిని దర్శించుకునే భక్తులు (శ్రీ గుండిచా ఆలయాన్ని కూడా సందర్శిస్తుంటారు. అత్యంత పవిత్రంగా భావించే ఈ ఆలయంలోకి భక్తులను సింహద్వారం ద్వారా అనుమతిస్తున్నారు. పునఃప్రారంభం సందర్భంగా తొలి మూడు రోజుల పాటు ఉచిత దర్శనం కల్పిస్తున్నారు. ఆ తర్వాత నుంచి రూ.10 ప్రవేశ రుసుముతో భక్తులను ఆలయంలోకి అనుమతించనున్నారు. మరోవైపు ఆలయ ప్రాంగణంతో పాటు వెలుపల కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే ఆలయంలోకి అనుమతిస్తున్నారు.

# పాఠాలు చెప్పకుండా గేమ్స్‌లో టీచర్ బిజీ

**భోపాల్:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు తరగతి గదిలో మొబైల్ ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ కాలక్షేపం చేస్తున్నారంటూ విద్యార్థులు ఆరోపించారు. అంతే కాకుండా విద్యార్థినుల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల వివరాలను కూడా అడుగుతున్నారని బాలికలు ఫిర్యాదు చేయడం వివాదాస్పదంగా మారింది. మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. కోట్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రశాంత్ అనే ఉపాధ్యాయుడిపై విద్యార్థులు పలు ఆరోపణలు చేశారు. పాఠశాల వేళల్లో తరగతులు నిర్వహించకుండా మొబైల్ ఫోన్‌లో గేమ్స్ ఆడుతున్నారని విద్యార్థులు ఆరోపించారు. మరోవైపు విద్యార్థినుల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల వివరాలను ఆ ఉపాధ్యాయుడు అడుగుతున్నారని బాలికలు ఫిర్యాదు చేశారు. దీంతో 'ఆ ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పడానికి పాఠశాలకు వస్తున్నారా? లేక అమ్మాయిల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు అడగడా నికి వస్తున్నారా?' అంటూ విద్యార్థినులు ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై విద్యార్థులు చేసిన ఫిర్యాదులు విద్యాశాఖ అధికారుల దృష్టికి వెళ్లాయి. దీంతో ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై అధికారికంగా విచారణ చేపడతారా? విచారణలో ఆరోపణలు నిజమని తేలితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# ప్రభుత్వ పాఠశాలలో విషాదం

- మెట్లు కూలి బాలిక మృతి
- శిథిలాల కింద చిక్కుకున్న నలుగురు విద్యార్థులు
- ముగ్గురికి గాయాలు
- పాఠశాల భవనం భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన




**పాట్నా:** బీహార్‌లోని ఖగారియా జిల్లాలో ప్రభుత్వ పాఠశాల భవనం మెట్లు అకస్మాత్తుగా కూలిపోవడంతో విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో తొమ్మిదేళ్ల బాలిక మృతి చెందగా, మరో ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. బుధవారం అమ్మీ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం మెట్లు అకస్మాత్తుగా కూలిపోయాయి. ఆ సమయంలో మెట్లపై ఉన్న పలువురు విద్యార్థులు శిథిలాల కింద చిక్కుకున్నారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు, పాఠశాల సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి విద్యార్థులను శిథిలాల నుంచి బయటకు తీశారు. అనంతరం వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే తీవ్రంగా గాయపడిన తొమ్మిదేళ్ల విద్యార్థిని రితికా కుమారి చికిత్స పొందుతూ మృతి చెందింది. మరో ముగ్గురు విద్యార్థులకు ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. పాఠశాలలో మెట్లు కూలిన విషయం తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. దీంతో పాఠశాల వద్ద కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న సదర్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ధనంజయ్ కుమార్, పోలీసులు, ఇతర అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిం చారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై వివరాలు సేకరించారు. ఇదిలా ఉండగా, మెట్లు కూలిన ప్రభుత్వ పాఠశాల భవనం భద్రతపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. భవనం పరిస్థితిని పూర్తిగా పరిశీలించి విద్యార్థుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, రష్యాలో టీయూ-95 వ్యూహాత్మక బాంబర్ విమానం ప్రమాదానికి గురైంది. తూర్పు ప్రాంతంలోని అముర్ ప్రాంతంలో శిక్షణ నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. ఈ ప్రమాదంలో ఆరుగురు సిబ్బంది మృతి చెందినట్లు పేర్కొంది. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించింది. జనసాంద్రత లేని ప్రాంతంలో బాంబర్ కూలినట్లు రక్షణ శాఖ తెలిపింది. ప్రమాదం జరిగిన ప్రాంతానికి రష్యా ఏరోస్పేస్ ఫోర్సెస్ కమిషన్ సభ్యులు చేరుకుని పరిశీలిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులు అన్వేషిస్తున్నారు. సోవియట్ కాలంలో 1952లో రూపకల్పన చేసిన టీయూ-95 బాంబర్ విమానం ఇప్పటికీ రష్యా వ్యూహాత్మక వైమానిక దళంలో వినియోగంలో ఉంది. ఖెచ్-101 క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించేందుకు రష్యా ఈ బాంబర్‌ను ఉపయోగిస్తోంది. ఉక్రెయిన్‌పై దాడుల్లోనూ ఈ క్షిపణులను వినియోగిస్తున్నట్లు సమాచారం. థర్మోన్యూక్లియర్ వార్‌హెడ్‌లను మోసుకెళ్లే సామర్థ్యం కూడా టీయూ-95 బాంబర్‌కు ఉంది.

# డెల్టా సీఈవోకు ఎలాన్ మస్క్ వార్నింగ్

- స్టార్‌లింక్‌ను కాదని అమెజాన్ 'లియో'కు ఓటు
- ఉద్యోగం కోల్పోతారంటూ మస్క్ హెచ్చరిక
- డెల్టా విమానాల్లో ఏఐకి కనెక్టివిటీ ఉండదంటూ వ్యంగ్యాస్త్రాలు




**న్యూయార్క్:** ప్రముఖ విమానయాన సంస్థ డెల్టా ఎయిర్‌లైన్స్ సీఈవో ఎడ్ బాస్టియన్, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. విమానాల్లో వైఫై సేవల కోసం మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌ను కాకుండా అమెజాన్‌కు చెందిన 'లియో' ఉపగ్రహ వ్యవస్థను ఎంచుకోవడంపై మస్క్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు డెల్టా సీఈవో ఎడ్ బాస్టియన్ తన ఉద్యోగాన్ని కోల్పోతారని హెచ్చరించడం సంచలనంగా మారింది. డెల్టా సీఈవో ఎడ్ బాస్టియన్ మస్క్ ప్రతిష్ఠపై చేసిన వ్యాఖ్యలే ఈ వివాదానికి కారణంగా తెలుస్తోంది. ఓ కంపెనీ కార్యక్రమంలో ఉద్యోగులతో మాట్లాడిన సందర్భంగా మస్క్‌తో కలిసి పనిచేయడానికి తాము ఇష్టపడటం లేదని ఎడ్ బాస్టియన్ అన్నట్లు ఓ విమానయాన రంగ విలేకరి వెల్లడించారు. మస్క్ ప్రతిష్ఠ గురించి తెలిస్తే ఆయన గురించి బయట ప్రచారంలో ఉన్న విషయాలు నిజమేనని బాస్టియన్ వ్యాఖ్యానించినట్లు ఆ నివేదిక పేర్కొంది. ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మస్క్ దృష్టికి వెళ్లాయి. దీంతో ఆయన 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు. డెల్టా సీఈవో తన నిర్ణయం కారణంగా ఉద్యోగాన్ని కోల్పోతారని హెచ్చరించారు. అంతేకాకుండా డెల్టా విమానాల్లోని కనెక్టివిటీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. స్టార్‌లింక్ కనెక్టివిటీ లేనందున ఓ కృత్రిమ మేధ వ్యవస్థను బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేయాలంటే దాన్ని డెల్టా విమానంలో ఉంచడమే సరైన మార్గమని ఎద్దేవా చేశారు. డెల్టా తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా ఆ సంస్థ గణనీయమైన సంఖ్యలో కస్టమర్లను కోల్పోయే అవకాశం ఉందని మస్క్ గతంలోనే హెచ్చరించారు. కాగా, డెల్టా ఎయిర్‌లైన్స్ అమెజాన్‌తో బహుళ సంవత్సరాల ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం దశలవారీగా 500 డెల్టా విమానాల్లో అమెజాన్ 'లియో' ఉపగ్రహ ఆధారిత వైఫై సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. మరోవైపు యునైటెడ్ ఎయిర్‌లైన్స్ సహా పలు ప్రత్యర్థి విమానయాన సంస్థలు ఇప్పటికే తమ విమానాల్లో వేగవంతమైన స్టార్‌లింక్ సేవలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డెల్టా ఎయిర్‌లైన్స్ తీసుకున్న నిర్ణయం, దానిపై ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు విమానయాన, సాంకేతిక రంగాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# యూపీ నుంచి రాజ్యసభ బరిలో ధనరాజ్ నథ్వానీ

- ఎస్పీ అభ్యర్థిగా ప్రకటించిన అఖిలేశ్ యాదవ్
- లక్నోలో నామినేషన్ దాఖలు
- పరిమల్ నథ్వానీ కుమారుడికి అవకాశం



**లక్నో:** రిలయన్స్ ఇండస్ట్రీస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్, రాజ్యసభ సభ్యుడు పరిమల్ నథ్వానీ కుమారుడు ధనరాజ్ నథ్వానీ ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగనున్నారు. ఆయనను తమ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా సమాజ్‌వాదీ పార్టీ ప్రకటించింది. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ సమక్షంలో బుధవారం లక్నోలో ధనరాజ్ నథ్వానీ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన అఖిలేశ్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రజా జీవితంలో కొత్త దశకు నాంది పలుకుతూ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసినట్లు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. పరిమల్ నథ్వానీ రాజ్యసభకు తిరిగి ఎన్నిక కావడానికి ఎన్డీఏ మద్దతు ప్రకటించిన కొన్ని నెలలకే ఆయన కుమారుడు ధనరాజ్ నథ్వానీకి ఎస్పీ అవకాశం ఇవ్వడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉత్తరప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఖాళీ కానున్న 10 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న పోలింగ్ జరగనుంది. ఎస్పీ సీనియర్ నేత రామ్‌గోపాల్ యాదవ్‌తో పాటు ధనరాజ్ నథ్వానీని తమ అభ్యర్థులుగా ఆ పార్టీ ప్రకటించింది. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలోని ప్రస్తుత బలాబలాల ఆధారంగా బీజేపీ నేతృత్వంలోని కూట మికి ఎనిమిది, సమాజ్‌వాదీ పార్టీకి రెండు రాజ్యసభ స్థానాలు దక్కే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాగా, ధనరాజ్ నథ్వానీ రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్ అధ్యక్షుడిగా, గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జామ్‌నగర్ తయారీ విభాగాల పర్యవేక్షణ, గుజరాత్‌లోని జియో వ్యాపారానికి వ్యూహాత్మక పర్యవేక్షణ, ఇంజినీరింగ్, కొనుగోళ్లు, నిర్మాణ విభాగాలకు నాయకత్వం వహించడం, రిలయన్స్ జియో డిఫెన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ పర్యవేక్షణ వంటి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ద్వారకాధీశ్ ఆలయ పరిపాలనా కమిటీ ఉపాధ్యక్షుడిగా, నాథ్ ద్వారా ఆలయ బోర్డు, గుజరాత్ రాష్ట్ర వన్యప్రాణుల బోర్డు సభ్యుడిగానూ కొనసాగుతున్నారు. తాజాగా రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా ఆయన తన కుటుంబ రాజకీయ వారసత్వాన్ని కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ధనరాజ్ నథ్వానీని అభ్యర్థిగా ప్రకటించడంపై ఎస్పీ సీనియర్ నేత ఒకరు ఆసక్తికరంగా స్పందించారు. 'మేము మిమ్మల్ని ఆశ్చర్యపరిచాము కదా? ఇలాంటి మరిన్ని ఆశ్చర్యకరమైన పరిణామాల కోసం వేచి చూడండి' అంటూ మీడియాతో వ్యాఖ్యానించారు.

# పసిడి పతకాల జోరు

## ఆసియా క్రీడల్లో భారత్‌కు ఒకే రోజు నాలుగు స్వర్ణాలు

- ఆర్చరీలో హ్యాట్రిక్.. షూటింగ్‌లో మరో పసిడి
- 60కి చేరిన మొత్తం పతకాల సంఖ్య
- హాకీ ఫైనల్‌కు మహిళల జట్టు.. ఖాయమైన పతకం



**నాగోయా:** జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్ పతకాల వేట జోరుగా సాగుతోంది. బుధవారం కాంపౌండ్ ఆర్చరీలో మూడు స్వర్ణాలు, షూటింగ్‌లో ఒక స్వర్ణం సాధించడంతో ఒకే రోజు నాలుగు పసిడి పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. బాక్సింగ్, రెజ్లింగ్‌లో కాంస్యాలు లభించగా.. మహిళల హాకీ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. దీంతో భారత్ మొత్తం పతకాల సంఖ్య 60కి చేరింది. ఇందులో 10 స్వర్ణాలు, 21 రజతాలు, 29 కాంస్యాలు ఉన్నాయి. కాంపౌండ్ ఆర్చరీ మహిళల టీమ్ విభాగంలో జ్యోతి సురేఖా వెన్నం, చకిత తానిపర్తి, పృథిక ప్రదీప్ జట్టు 238–234తో చైనాను ఓడించి స్వర్ణం సాధించింది. ఈ స్కోరుతో ప్రపంచ రికార్డును సమం చేసింది. మిక్స్‌డ్ టీమ్‌లో చకిత తానిపర్తి–సాహిల్ జాదవ్ జోడీ షూట్‌ఆఫ్‌లో దక్షిణ కొరియాను అధిగమించి పసిడి దక్కించుకుంది. పురుషుల టీమ్‌లో కుషాల్ దలాల్, సాహిల్ జాదవ్, గణేశ్ మణి రత్నం 238–237తో చైనాపై విజయం సాధించారు. మిక్స్‌డ్ టీమ్ స్వర్ణంతో 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగానికి భారత్‌కు కోటా స్థానం లభించింది.

### షూటింగ్‌లో రికార్డు

మిక్స్‌డ్ ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో నీరూ ధాండా–క్షైనన్ చెనై జోడీ 34 పాయింట్లతో స్వర్ణం సాధించింది. ఈ క్రమంలో ఏషియన్ గేమ్స్ రికార్డు నెలకొల్పింది. ఈ విభాగంలో భారత్‌కు ఇదే తొలి స్వర్ణం. ఇక బాక్సింగ్ 60 కిలోల సెమీఫైనల్లో ప్రియా ఘూంగాస్ చైనాకు చెందిన యాంగ్ చెంగ్యు చేతిలో 1–4తో ఓడినా కాంస్య పతకం సాధించింది. 90 కిలోల సెమీఫైనల్లో కపిల్ పొఖరియా ఉజ్బెకిస్థాన్ ప్రపంచ ఛాంపియన్ తురాబెక్ ఖబిబుల్లాయెవ్ చేతిలో 1–4తో పరాజయం పాలై కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. 75 కిలోల విభాగంలో లవ్లీనా బోర్గొహైన్ 3–2తో కజకిస్థాన్ ప్రపంచ ఛాంపియన్ నటాల్యా బొగ్దనోవాపై గెలిచి ఫైనల్‌కు చేరింది. రెజ్లింగ్‌లో గ్రీకో–రోమన్ 87 కిలోల విభాగంలో సునీల్ కుమార్




కాంస్య పతకం సాధించాడు. కాంస్య పతక పోరులో ఫిలిప్పీన్స్‌కు చెందిన కాలమ్ జాస్టన్ రాబర్ట్స్‌ను 9–0తో ఓడించాడు. ఏషియన్ గేమ్స్ గ్రీకో–రోమన్ రెజ్లింగ్‌లో రెండుసార్లు పతకం సాధించిన తొలి భారతీయుడిగా నిలిచాడు.

### హాకీ ఫైనల్లో భారత్

మహిళల హాకీ సెమీఫైనల్లో భారత్ 2–0తో దక్షిణ కొరియాను ఓడించి ఫైనల్‌కు చేరింది. ఇషికా చౌదరి, కెప్టెన్ సలీమా టెటే ఒక్కో గోల్ చేశారు. ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ చైనాతో భారత్ తలపడనుంది. భారత్ విజయం సాధిస్తే మహిళల హాకీలో 1982 తర్వాత రెండో ఏషియన్ గేమ్స్ స్వర్ణం దక్కుతుంది. ఇక స్క్వాష్‌లో రెండు పతకాలు ఖాయమయ్యాయి. పురుషుల జట్టు 2–0తో కువైట్‌ను, మహిళల జట్టు 2–0తో సింగపూర్‌ను ఓడించి సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. దీంతో రెండు జట్లకు కనీసం కాంస్య పతకాలు ఖాయమయ్యాయి. టెన్నిస్ విభాగంలో పురుషుల సింగిల్స్‌లో సుమిత్ నాగల్ 6–3, 6–2తో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన సెర్గే ఫొమిన్‌ను ఓడించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరాడు. ధక్షి ణేశ్వర్ సురేశ్ 3–6, 4–6తో చైనీస్ తైపీకి చెందిన చున్–హ్సిన్ సెంగ్ చేతిలో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్‌లో ఎన్. శ్రీరామ్ బాలాజీ–అనిరుధ్ చంద్రశేఖర్, యూకీ భాంబ్రీ–ధక్షి ణేశ్వర్ సురేశ్ జోడీలు క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పాలయ్యాయి.




# గిల్ డబుల్.. రోహిట్

- విండీస్‌పై భారత్ 8 వికెట్ల ఘన విజయం
- మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ 2–0తో కైవసం
- 406 పరుగుల ఛేదనతో భారత్ కొత్త రికార్డు




గువాహటి: కెప్టెన్ శుభ్‌మన్ గిల్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ విధ్వంసక బ్యాటింగ్‌తో భారత్ వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. వెస్టిండీస్‌తో రెండో వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. విండీస్ నిర్దేశించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని 43.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 2–0తో ఆధిక్యంలో నిలిచింది. ఛేదనలో గిల్ 133 బంతుల్లో 26 ఫోర్లు, 8 సిక్సర్లతో 223 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కేవలం 117 బంతుల్లో డబుల్ సెంచరీ పూర్తి చేసి వన్డేల్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఇషాన్ కిషన్ (126 బంతులు) రికార్డును అధిగమించాడు. గిల్‌కు ఇది వన్డేల్లో 11వ సెంచరీ. రోహిత్ శర్మ (101, 75 బంతుల్లో) పరుగులు చేసి గిల్‌తో కలిసి తొలి వికెట్‌కు 254 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 7 వికెట్లకు 405 పరుగులు చేసింది. జాన్ క్యాంప్‌బెల్ (101), షై హోప్ (104), అమీర్ జాంగూ (114) సెంచరీలు సాధించారు. వన్డేల్లో ఒక ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ ముగ్గురు బ్యాటర్లు సెంచరీలు చేయడం ఇదే తొలిసారి. భారత్ తరపున కుల్దీప్ యాదవ్ 2/65, రవీంద్ర జడేజా 2/75తో రాణించారు. కుల్దీప్ వన్డేల్లో 200 వికెట్ల క్లబ్‌లో చేరాడు.

### హిట్‌మ్యాన్ 12 వేల పరుగుల మైలురాయి

ఈ మ్యాచ్‌లో భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అరుదైన ఘనత సాధించాడు. వన్డే క్రికెట్‌లో 12వేల పరుగులు పూర్తి చేసిన ఏడో బ్యాటర్‌గా, మూడో భారతీయుడిగా నిలిచాడు. 291వ వన్డేలో ఈ మైలురాయిని అందుకున్న రోహిత్.. అ దే మ్యాచ్‌లో 72 బంతుల్లో 35వ వన్డే శతకాన్ని నమోదు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. ఇక ఓవరాల్‌గా వన్డేల్లో అత్యధిక పరుగుల జాబితాలో రోహిత్ ఏడో స్థానంలో ఉన్నాడు. సచిన్ టెండూల్కర్ (18,426), విరాట్ కోహ్లి (15,000కుపైగా) తొలి రెండు స్థానాల్లో ఉండగా.. కుమార సంగక్కర (14,234), రికీ పాంటింగ్ (13,704), సనత్ జయసూర్య (13,430), మహేల జయవర్ధనే (12,650) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

# రిజ్వాన్‌కు పాక్ సైబర్ క్రైమ్ ఏజెన్సీ నోటీసులు

- అక్టోబర్ 2న విచారణకు హాజరుకావాలని ఆదేశం
- బెట్టింగ్ ఆరోపణలపై దర్యాప్తు జరుగుతున్నట్లు ప్రచారం

**కరాచీ:** పాకిస్థాన్ మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్‌కు నేషనల్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌సీసీఐఏ) నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 2న లాహోర్‌లోని సంస్థ కార్యాలయానికి హాజరై తన ఫోన్ ఫోరెన్సిక్ పరీక్ష, విశ్లేషణకు సహకరించాలని ఆదేశించింది. రిజ్వాన్ తన న్యాయవాదితో కలిసి హాజరయ్యే అవకాశం ఉంది. ఆగస్టు 31న ఇంగ్లండ్‌లోని లార్డ్స్‌లో జరిగిన రెండో టెస్టు సందర్భంగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు భద్రతా అధికారి రిజ్వాన్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఎన్‌సీసీఐఏకు అప్పగించారు. అప్పటి నుంచి ఫోన్ దర్యాప్తు సంస్థ వద్దే ఉంది. ఈ వ్యవహారంలో రిజ్వాన్ ఇప్పటికే ఒక సారి ఎన్‌సీసీఐఏ ఎదుట హాజరయ్యాడు. ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న సమయంలో మూడు గంటల్లో తిరిగి ఇస్తామని చెప్పారని, అనంతరం డిజిటల్ ఫోరెన్సిక్ పరీక్ష పూర్తయ్యే వరకు ఇవ్వబోమని తెలిపారని రిజ్వాన్ సెప్టెంబర్ 28న ఎన్‌సీసీఐఏకు రాసిన లేఖలో పేర్కొన్నాడు. ఫోన్‌ను తిరిగి ఇవ్వడంతో పాటు తనపై దర్యాప్తు చేస్తున్న ఆరోపణలు, అనుమానాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరాడు. ఆన్‌లైన్ బెట్టింగ్, జూదానికి సంబంధించిన ఆరోపణలపై దర్యాప్తు జరుగుతున్నట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. విచారణకు తాను సహకరించడం లేదన్న వార్తలను రిజ్వాన్ ఇప్పటికే ఖండించాడు.




# జియో అలయంజ్‌లో రూ.640 కోట్ల పెట్టుబడి

- జియో ఫైనాన్స్, అలయంజ్ యూరప్ చెరో రూ.320.05 కోట్లు
- రైట్స్ ఇష్యూ ద్వారా 64.01 కోట్ల ఈక్విటీ షేర్ల కేటాయింపు
- బీమా సంస్థ వ్యాపార విస్తరణకు నిధుల వినియోగం




**న్యూఢిల్లీ:** జియో ఫైనాన్స్, అలయంజ్ యూరప్ బీవీ సంస్థలు జియో అలయంజ్ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్‌లో రూ.640.10 కోట్ల తాజా పెట్టుబడి పెట్టాయి. రైట్స్ ఇష్యూ ద్వారా ఈ నిధులను సమకూర్చినట్లు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన నియంత్రణ సమాచారంలో వెల్లడించింది. రైట్స్ ఇష్యూలో భాగంగా జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, అలయంజ్ యూరప్ బీవీలకు చెరో 32,00,50,000 ఈక్విటీ షేర్లను కేటాయించినట్లు కంపెనీ తెలిపింది. ఒక్కో షేరు ముఖ విలువ రూ.10గా ఉంది. ఈ మేరకు రెండు సంస్థలు చెరో రూ.320.05 కోట్ల చొప్పున పెట్టుబడి పెట్టాయి. దీంతో జియో అలయంజ్ జనరల్ ఇన్సూరెన్స్‌లో తాజా పెట్టుబడి మొత్తం రూ.640.10 కోట్లుగా నమోదైంది. జియో ఫైనాన్స్, అలయంజ్ యూరప్ బీవీ సంయుక్త భాగస్వామ్యంతో 50:50 నిష్పత్తితో జియో అలయంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. రైట్స్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను బీమా సంస్థ వ్యాపార కార్యకలాపాల అవసరాలకు వినియోగించనున్నట్లు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పేర్కొంది. తాజా పెట్టుబడితో జాయింట్ వెంచర్‌లో జియో ఫైనాన్స్ ఇప్పటివరకు పెట్టిన మొత్తం పెట్టుబడి రూ.375 కోట్లకు చేరినట్లు కంపెనీ వెల్లడించింది. ఈ లావాదేవీ సంబంధిత పక్షాల మధ్య జరిగినప్పటికీ, స్వతంత్ర వాణిజ్య ప్రాతిపదికన నిర్వహించినట్లు స్పష్టం చేసింది. ఇందులో తమ ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ లేదా ఇతర గ్రూప్ కంపెనీలకు ఎలాంటి ప్రయోజనం లేదని తెలిపింది. ఇదిలా ఉండగా, బీఎస్ఈలో బుధవారం జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు 0.60 శాతం నష్టపోయి రూ.216.60 వద్ద ముగిసింది.

# మూడో రోజూ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

## చివరి గంట అమ్మకాలతో సెన్సెక్స్ 49 పాయింట్లు డౌన్

- నిఫ్టీ 96 పాయింట్లు క్షీణత.. లోహ, ఫార్మా షేర్లపై ఒత్తిడి
- సెప్టెంబర్‌లో సెన్సెక్స్ 5.81, నిఫ్టీ 6శాతం పతనం




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. చివరి గంటలో లోహ, ఫార్మా షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో రోజంతా సాధించిన లాభాలను సూచీలు కోల్పోయాయి. పెరుగుతున్న ముడిచమురు ధరలు, అధిక ప్రపంచ బాండ్ ఈల్డ్స్ కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 48.78 పాయింట్లు (0.07 శాతం) తగ్గి 72,480.29 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 533 పాయింట్లు లాభపడి 73,062.23ని తాకిన సూచీ చివర్లో నష్టాల్లోకి జారుకుంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 95.75 పాయింట్లు (0.42 శాతం) తగ్గి 22,620.45 వద్ద స్థిరపడింది.

### సెప్టెంబర్‌లో భారీ నష్టం

నెల మొత్తంగా సెన్సెక్స్ 4,476.98 పాయింట్లు (5.81 శాతం), నిఫ్టీ 1,459.95 పాయింట్లు (6 శాతం) నష్టపోయాయి. సెన్సెక్స్ షేర్లలో ఎటర్నల్, సన్ ఫార్మా, టైటాన్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నష్టపోయాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, యాక్సిస్ బ్యాంక్ లాభపడ్డాయి. బ్రెంట్ క్రూడ్ ధర 0.54 శాతం పెరిగి బ్యారెల్‌కు 103.10 డాలర్లకు చేరింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మంగళవారం రూ.9,980.22 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు. ఇక బీఎస్ఈలో హాస్పిటల్స్ సూచీ 4.97 శాతం, హెల్త్‌కేర్ 2.35 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 1.43 శాతం, మెటల్ 1.24 శాతం నష్టపోయాయి. రియల్టీ సూచీ 1.42 శాతం లాభపడింది. మిడ్‌క్యాప్ సూచీ 0.44 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.34 శాతం పెరిగింది.




## ఎయిరిండియా కొత్త సీఈఓకు

# భద్రతా అనుమతులు

- నేడు బాధ్యతలు స్వీకరించనున్న టెవోల్డే గెబ్రెమరియమ్

**న్యూఢిల్లీ:** ఎయిరిండియా నూతన సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైన టెవోల్డే గెబ్రెమరియమ్‌కు భద్రతా అనుమతులు లభించాయి. దీంతో ఆయన గురువారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ విషయాన్ని ఎయిరిండియా ప్రతినిధి ధ్రువీకరించారు. ఇథియోపియా జాతీయుడైన గెబ్రెమరియమ్ నియామకాన్ని ఆగస్టు 5న సంస్థ ప్రకటించింది. నష్టాల్లో ఉన్న ఎయిరిండియా విస్తరణ ప్రణాళికలను అమలు చేస్తున్న సమయంలో ఆయన బాధ్యతలు చేపడుతున్నారు. సంస్థకు సీఈఓ, ఎండీగా వ్యవహరించనున్న రెండో విదేశీయుడు ఆయన. న్యూజిలాండ్‌కు చెందిన క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో గెబ్రెమరియమ్ బాధ్యతలు చేపట్టనున్నారు. సెప్టెంబర్ 28న ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో గెబ్రెమరియమ్ సంస్థలో ఖర్చుల నియంత్రణను సంస్కృతిగా మార్చాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. స్థిరమైన లాభదాయకత, భద్రత, కార్యకలాపాల విశ్వసనీయతకు ప్రాధాన్యమివ్వనున్నట్లు తెలిపారు. ఖర్చులను తగ్గించడం, నిర్వహణ సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్యోగుల సూచనలను ప్రోత్సహించే కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు.

# బ్యాంకు రుణ వడ్డీ రేట్లలో స్వల్ప మార్పు

- ఆగస్టులో పాత రుణాలపై వడ్డీ 8.96 శాతానికి తగ్గింపు
- కొత్త రుణాలపై రేటు 8.61 శాతానికి పెంపు
- కొత్త టర్మ్ డిపాజిట్ల వడ్డీ 5.67 శాతానికి పతనం

**ముంబై:** బ్యాంకుల రుణ, డిపాజిట్ వడ్డీ రేట్లలో ఆగస్టులో మిశ్రమ ధోరణి నమోదైంది. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల పాత రూపాయి రుణాలపై సగటు వడ్డీ రేటు (డబ్ల్యూఏఎల్ఆర్) జూలైలో 8.97 శాతం నుంచి ఆగస్టులో 8.96 శాతానికి స్వల్పంగా తగ్గిందని ఆర్‌బీఐ బుధవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. అయితే కొత్తగా ఇచ్చిన రూపాయి రుణాలపై సగటు వడ్డీ రేటు 8.52 శాతం నుంచి 8.61 శాతానికి పెరిగింది. ఏడాది కాలానికి సంబంధించిన ఎంసీఎల్ఆర్ సెప్టెంబర్‌లో 8.61 శాతానికి తగ్గింది. ఆగస్టులో ఇది 8.70 శాతంగా ఉంది. బ్యాంకుల ఫ్లోటింగ్ రేట్ రుణాల్లో ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్‌తో అనుసంధానమైన రుణాల వాటా జూన్ చివరికి 68.2 శాతానికి చేరింది. మార్చి చివరికి ఇది 67.6 శాతంగా ఉంది. అదే సమయంలో ఎంసీఎల్ఆర్‌తో అనుసంధానమైన రుణాల వాటా 30.2 నుంచి 29.6 శాతానికి తగ్గింది. మరోవైపు రూపాయి టర్మ్ డిపాజిట్లపై పాత డిపాజిట్ల సగటు వడ్డీ రేటు జూలైలో 6.58 శాతం నుంచి ఆగస్టులో 6.56 శాతానికి తగ్గింది. కొత్తగా తీసుకున్న టర్మ్ డిపాజిట్లపై రేటు 5.85 శాతం నుంచి 5.67 శాతానికి గణనీయంగా తగ్గినట్లు ఆర్‌బీఐ తెలిపింది.




## పరిశ్రమల రుణాల్లో 18.2 శాతం వృద్ధి

**ముంబై:** దేశంలో పరిశ్రమలకు బ్యాంకులు అందిస్తున్న రుణాల్లో వృద్ధి వేగం పుంజుకుంది. 2026 ఆగస్టులో పరిశ్రమల రుణాలు వార్షిక ప్రాతిపదికన 18.2 శాతం పెరిగాయి. గతేడాది ఇదే సమయంలో ఈ వృద్ధి 7 శాతంగా ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బుధవారం విడుదల చేసిన గణాంకాల్లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఆగస్టు 31తో ముగిసిన పక్షం నాటికి బ్యాంకుల ఆహారేతర రుణాలు 18.8 శాతం పెరిగాయి. మౌలిక వసతులు, ఇంజినీరింగ్, లోహాలు, రసాయనాలు, ఆహార శుద్ధి, వస్త్రాలు, నిర్మాణం తదితర రంగాలకు రుణాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. సేవల రంగానికి బ్యాంకు రుణాలు 24.3 శాతం పెరగగా.. ఎన్‌బీఎఫ్‌సీలు, వాణిజ్యం, వృత్తిపరమైన సేవలు, వాణిజ్య రియల్ ఎస్టేట్ విభాగాలు ఇందుకు దోహదపడ్డాయి. వ్యక్తిగత రుణాలు 16.9 శాతం, వ్యవసాయం, అనుబంధ కార్య కలాపాలకు రుణాలు 17.2 శాతం పెరిగాయి.

# అమెరికా డెర్మటాలజీ మార్కెట్లోకి అరబిందో

- 'అడ్వీ'తో రంగప్రవేశం చేసిన అక్రోటెక్ బయో ఫార్మా

**న్యూఢిల్లీ:** అరబిందో ఫార్మా అమెరికా డెర్మటాలజీ మార్కెట్లోకి ప్రవేశించింది. కంపెనీ అనుబంధ సంస్థ అక్రోటెక్ బయోఫార్మా 'అడ్వీ' ఆయింట్‌మెంట్‌ను అమెరికాలో విడుదల చేసింది. తేలికపాటి నుంచి మధ్యస్థ అటోపిక్ డెర్మటైటిస్ చికిత్సకు ఈ నాన్–స్టెరాయిడల్ ఔషధాన్ని పెద్దలు, రెండేళ్లు పైబడిన పిల్లల్లో ఉపయోగించవచ్చు. ఈ మందును ఒట్సుకా ఫార్మాస్యూటికల్ అభివృద్ధి చేయగా.. అమెరికాలో వాణిజ్యీకరణ హక్కులను అక్రోటెక్ పొందింది. అడ్వీ లాంచ్‌తో పాటు డెర్మటాలజీ వ్యాపారం కోసం ప్రత్యేక విభాగాన్ని అక్రోటెక్ ఏర్పాటు చేసింది. ఐక్యూవీఐఏ గణాంకాల ప్రకారం.. 2026 జూలైతో ముగిసిన 12 నెలల్లో అమెరికా మార్కెట్లో ఈ విభాగం విలువ సుమారు 1.3 బిలియన్ డాలర్లుగా ఉంది.





# ఊర్వశి వర్సెస్ ఏఐ సంస్థ


బాలీవుడ్ హాట్ బ్యూటీ ఊర్వశి రౌతేలా, లాస్ ఏంజిల్స్‌కు చెందిన ఓ కృత్రిమ మేధ సంస్థపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలు, వీడియోలను ఉపయోగించుకుంటున్నారంటూ సదరు సంస్థపై న్యాయపరమైన చర్యలకు దిగినట్లు ఆమె వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించిన ఊర్వశి.. ఏకంగా రూ.7 వేల కోట్ల నష్టపరిహారం కోరుతూ న్యాయపోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఎవరి వ్యాపారాలు, బ్రాండ్లను వారు అభివృద్ధి చేసుకోవచ్చని, అయితే తన అనుమతి లేకుండా తన పేరు, వ్యక్తిగత చిత్రాలు, వీడియోలను ఉపయోగిస్తే మాత్రం ఊరుకునేది లేదని ఆమె స్పష్టం చేశారు. ఊర్వశి చేసిన ఈ ప్రకటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వివాదం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై బాలీవుడ్.ఏఐ వ్యవస్థాపకుడు, సీఈఓ షీరాజ్ హసన్ స్పందించారు. ఊర్వశి కోరుతున్న రూ.7 వేల కోట్ల నష్టపరిహారం చాలా హాస్యాస్పదంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఊర్వశితో తాను నిర్వహించిన ఓ ఇంటర్వ్యూ వైరల్ కావడంతోనే ఈ వివాదం తెరపైకి వచ్చిందని పేర్కొన్నారు. ఆ ఇంటర్వ్యూలో బాలీవుడ్, కృత్రిమ మేధ భవిష్యత్తు గురించి చర్చించినప్పుడు ఊర్వశి సమాధానం చెప్పడంలో తడబడిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఊర్వశి న్యాయపరమైన చర్యలపై షీరాజ్ హసన్ దీటుగా స్పందిస్తూ, తాము ఎవరి నోటా బలవంతంగా ఎలాంటి మాటలు చెప్పించలేదని స్పష్టం చేశారు. భవిష్యత్తు కృత్రిమ మేధ, ఏఐ సినిమాలు, డిజిటల్ స్టార్లదేనని, రాబోయే మార్పును ఎవరూ ఆపలేరని అన్నారు. ఆ మార్పును అందరూ స్వీకరించాల్సిందేనని పేర్కొన్నారు.

## రజినీకాంత్‌తో మళ్లీ స్క్రీన్ షేర్ చేయడం అదృష్టం

కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ ఓ వైపు వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూనే మరోవైపు హీరోగా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా యాక్షన్ థ్రిల్లర్ 'బెయిల్'. ప్రతిభావంతుడైన దర్శకుడు పవన్ వడయార్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో సాయి కుమార్, జయరామ్, ధీక్షిత్ శెట్టి, సంజన ఆనంద్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'బెయిల్' అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో



సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న శివరాజ్ కుమార్ తాను నటిస్తున్న మరో మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'జైలర్ 2' గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సూపర్‌స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ క్రేజీ సీక్వెల్‌లో తనకు కాస్త ఎక్కువ స్క్రీన్ స్పేస్ లభించడం ఎంతో ప్రత్యేకమైన విషయమని ఆయన తెలిపారు. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తమ పాత్రలను రూపొందించిన తీరు, వాటిని కథలో ఉపయోగించుకున్న విధానం ఎంతో ఆసక్తికరంగా, ఉత్సాహభరితంగా ఉందని శివరాజ్ కుమార్ పేర్కొన్నారు. ఇండియన్ సినిమా లెజెండ్ రజినీకాంత్‌తో కలిసి మరోసారి తెరను పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ఇలాంటి అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కాగా బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న 'జైలర్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'జైలర్ 2'ను అక్టోబర్ 15న థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. రజినీకాంత్, శివరాజ్ కుమార్ కలయికలో తెరకెక్కుతున్న ఈ భారీ మల్టీస్టారర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.



## స్టార్‌డమ్ ఎవరి సొత్తు కాదు

బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా స్టార్‌డమ్‌పై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన సినీ పరిశ్రమలో ఒకప్పుడు ఉన్న స్టార్ హోదా విధానం ఇప్పుడు పూర్తిగా మారిపోయిందని, ఆ రోజులు గతించాయని అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు హీరో అంటే కొద్దిమందికే పరిమితమైన ప్రత్యేక హోదా ఉండేదని, ప్రస్తుతం వినోదానికి అనేక వేదికలు అందుబాటులోకి రావడంతో పరిస్థితులు మారిపోయాయని చెప్పారు. యూట్యూబర్లు, సామాజిక మాధ్యమాల ప్రభావశీలులు ఇలా ప్రతి రంగంలోనూ ప్రత్యేక అభిమానగణాన్ని సంపాదించుకున్న స్టార్లు ఉన్నారని పేర్కొన్నారు. ఒక వేదికపై పెద్ద స్టార్‌గా గుర్తింపు పొందిన వ్యక్తి గురించి మరో వేదికకు చెందిన ప్రేక్షకులకు తెలియకపోవచ్చని, అందుకే ప్రస్తుత కాలంలో స్టార్‌డమ్ అందరికీ ఒకేలా ఉండటం లేదని వివరించారు. స్టార్‌డమ్ అనేది ఎవరి సొత్తు కాదని, అసలైన స్టార్ అంటే మంచి కథ మాత్రమేనని ఆయుష్మాన్ ఖురానా వ్యాఖ్యానించారు. ప్రేక్షకులతో తనకున్న అనుబంధం గురించి మాట్లాడుతూ.. కొందరు హీరోలు బయటకు రావడానికి, మీడియాతో మాట్లాడటానికి ఇష్టపడరని అన్నారు. తాను రేడియో, టెలివిజన్ రంగాల నుంచి వచ్చిన వ్యక్తిని కావడంతో సామాన్య ప్రజలతో మాట్లాడటం తనకు అలవాటని చెప్పారు. తాను ఎంచుకునే కథలు కూడా సమాజంలోని వాస్తవ జీవితానికి దగ్గరగా ఉంటాయని పేర్కొన్నారు. తనలోని నటుడు నిరంతరం సజీవంగా ఉండాలంటే సామాన్య ప్రజలతో మమేకమవుతూ, వారితో మాట్లాడుతూనే ఉండాలని ఆయుష్మాన్ ఖురానా స్పష్టం చేశారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు తెరతీశాయి.

## బిగ్‌బాస్‌లో హైటెన్షన్.. డేంజర్ జోన్‌లో ఆ 9 మంది

బిగ్‌బాస్ సీజన్–10 అంచనాలకు మించి ట్విస్టులతో ప్రేక్షకులను అలరిస్తోంది. ఇప్పటికే మూడు వారాలు విజయవంతంగా పూర్తి చేసుకుని నాలుగో వారంలోకి అడుగుపెట్టిన ఈ షోలో ప్రస్తుతం 15 మంది కంటెస్టెంట్లు కొనసాగుతున్నారు. వైల్డ్ కార్డ్ ద్వారా హౌస్‌లోకి అడుగుపెట్టిన రెండు రోజులకే రూ.15 లక్షలు తీసుకుని మిథిలేష్ బయటకు వెళ్లడం ఒక్కసారిగా హైటెన్షన్‌ను పెంచింది. ఈ పరిణామంతో షో మరింత ఆసక్తికరంగా మారగా, వీకెండ్ ఎపిసోడ్ అనంతరం హౌస్‌మెట్స్‌కు బిగ్‌బాస్ 'బిగ్‌బాస్ రథం' అనే టాస్క్ నిర్వహించారు. ఇందులో ఇంటి సభ్యులు భైరవ, సప్తశక్తి అనే రెండు జట్లుగా విడిపోయి పోటాపోటీగా గేమ్స్ ఆడారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో చివరకు భైరవ టీమ్ విజయం సాధించడం తో ఆ జట్టుకు నామినేషన్ చేసే బంపర్ పవర్‌ను బిగ్‌బాస్ అందించారు. ఈ అవకాశంతో భైరవ టీమ్ సభ్యులు నామినేషన్ల ప్రక్రియను మరింత ఆసక్తికరంగా మార్చారు. త్రిగుణ్.. రోహిత్ గేమ్ ఆడే విధానాన్ని, ఇతరులను ప్రభావితం చేసే తీరును తప్పుపడుతూ 'అగ్నిపరీక్ష గ్రూపిజం' పేరుతో అతడిని నామినేట్ చేశారు. నరేశ్.. అమన్‌ను నామినేట్ చేయగా, భైరవ టీమ్‌లోని మిగతా సభ్యులు కూడా తమ వ్యూహాలకు అనుగుణంగా నామినేషన్లు పూర్తి చేశారు. ఝూన్సీ.. సృష్టిని, అమన్.. త్రిగుణ్‌ను, రాంప్రసాద్.. షాలినిని, రోహిత్.. దేబ్జానీని నామినేట్ చేశారు. అపూర్వ..




త్రిగుణ్‌ను, వర్షిణి.. సృష్టిని, వంశీ.. చరణ్‌ను నామినేట్ చేయగా, సుధీర్ కూడా చరణ్‌ను నామినేట్ చేశాడు. ఇక ముకేశ్ విషయానికి వస్తే.. వంశీని ఎలిమినేషన్ నుంచి కాపాడినందుకు అతడికి డైరెక్ట్ నామినేషన్ శిక్ష విధించారు. దీంతో ఈ వారం ముకేశ్, త్రిగుణ్, దేబ్జానీ, రోహిత్, షాలిని, అమన్, నరేశ్, చరణ్, సృష్టి కలిపి మొత్తం తొమ్మిది మంది డేంజర్ జోన్‌లో నిలిచారు. ఈ తొమ్మిది మందిలో ఈ వారం ఎవరు హౌస్ నుంచి ఎలిమినేట్ అవుతారనే ఉత్కంఠ ప్రేక్షకుల్లో నెలకొంది.

## 'డిమాంటే కాలనీ-3'కు స్టే ఎత్తివేసిన కోర్టు

అత్యధిక ప్రేక్షకాదరణ పొందిన హారర్ థ్రిల్లర్ చిత్రాల్లో 'డిమాంటే కాలనీ' ఫ్రాంచైజీ ఒకటి. ఇప్పటికే రెండు భాగాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సిరీస్ నుంచి రాబోతున్న మూడో భాగం 'డిమాంటే కాలనీ–3' కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నటుడు అరుళ్ నిధి హీరోగా, ఆర్. అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్ర విడుదలపై ఇటీవల కోర్టు తాత్కాలిక స్టే విధించిన విషయం తెలిసిందే. సినిమా నిర్మాణ భాగస్వామ్యం, హక్కులకు సంబంధించిన విషయమై 'వైట్ నైట్స్ ఎంటర్‌టైన్ మెంట్' సంస్థకు, దర్శకుడు అజయ్ జ్ఞానముత్తుకు మధ్య వివాదం తలెత్తింది. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించారంటూ సదరు నిర్మాణ సంస్థ కోర్టును ఆశ్రయించడంతో మద్రాస్ హైకోర్టు సినిమా విడుదలపై తాత్కాలిక స్టే విధించింది. అయితే తాజా విచారణ అనంతరం న్యాయస్థానం ఆ స్టే ఉత్తర్వులను పూర్తిగా ఎత్తివేసినట్లు సమాచారం. దీంతో 'డిమాంటే కాలనీ–3' చిత్రాన్ని విడుదల చేసేందుకు ప్రస్తుత నిర్మాణ సంస్థ 'ప్యాషన్ స్టూడియోస్'కు కోర్టు అనుమతి లభించింది.

## సైకో కిల్లర్ వేటలో ఆది సాయికుమార్..

ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న తాజా క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'సబ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్'. నగరంలో వరుస హత్యలకు పాల్పడుతూ పోలీసులను తప్పుదోవ పట్టిస్తున్న ఓ సైకో కిల్లర్ చుట్టూ ఈ సినిమా కథ సాగుతుంది. అతడి ఆచూకీ కనిపెట్టి కేసును ఛేదించేందుకు ఎస్ఐ యుగంధర్‌గా ఆది సాయికుమార్ రంగంలోకి దిగుతాడు. 24 గంటల్లోనే శవాలు మాయమవడం, ఓ ప్రిన్సిపాల్ సెక్రటరీ మృతదేహం అదృశ్యం కావడం వంటి ఆసక్తికర పరిణామాలతో కథనం ఉత్కంఠభరితంగా సాగనున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తాజాగా విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌లోని సస్పెన్స్ సన్నివేశాలు, ఆది సాయికుమార్ యాక్షన్ ఆకట్టుకుంటున్నాయి. రాఘవేంద్ర కటారీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మేఘలేఖ కథానాయికగా నటిస్తుండగా, మార్కస్ ఎన్ సంగీతం అందిస్తున్నారు. 'ఒక రహస్యమైన కేసు.. నిర్భయమైన అధికారి.. ప్రమాదాలతో కూడిన మిషన్..' అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో విడుదల చేసిన ట్రైలర్‌కు ప్రస్తుతం నెట్టింట మంచి స్పందన లభిస్తోంది. ట్రైలర్‌తో



సినిమాపై అంచనాలు మరింత పెరగగా, 'సబ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్' అక్టోబర్ 2న గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది.

## 'ధర్మన్'లో పవర్‌ఫుల్ విలన్‌గా రామ్ ఎంట్రీ



సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న హైప్రొఫైల్ ఎంటర్‌టైనర్ 'ధర్మన్'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం మైసూర్‌లో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలో హీరోయిన్ రాశీ ఖన్నా చేసిన ఓ చిన్న సోషల్ మీడియా పోస్ట్ చిత్ర బృందం దాచాలనుకున్న కీలక విషయాన్ని బయటపెట్టింది. ఈ సినిమాలో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటిస్తున్నట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. రామ్ ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొంటున్నప్పు టికీ చిత్ర బృం దం మాత్రం ఆయన పాత్ర, సినిమాలో భాగస్వా మ్యాన్ని రహస్యంగా ఉంచుతూ వచ్చింది. అందుకే ఇప్పటి వరకు రామ్ పోతినేని 'ధర్మన్'లో నటిస్తున్నట్లు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రస్తుతం మైసూర్‌లో జరుగుతున్న కీలక షెడ్యూల్‌లో రజినీకాంత్, రామ్ పోతినేని, రాశీ ఖన్నా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజినీకాంత్, రామ్ పోతినేనితో కలిసి దిగిన ఫొటోను రాశీ ఖన్నా సోషల్ మీడియాలో షేర్ చేయడంతో రామ్ ఈ సినిమాలో భాగమైన విషయాన్ని ఆమె పరోక్షంగా వెల్లడించారు. అయితే ఆ పోస్ట్‌ను వెంటనే తొలగించినప్ప టికీ అప్పటికే ఫొటో నెట్టింట వైరల్‌గా మారింది. రజినీకాంత్, రామ్ పోతినేని, రాశీ ఖన్నా కలిసి ఉన్న ఫొటో వైరల్ కావడంతో 'ధర్మన్'లో రామ్ పోతినేని నటిస్తున్న విషయం అధికారికంగా నిర్ధారణైనట్లైంది. మేకర్స్ సర్‌ప్రైజ్‌గా దాచాలనుకు న్న రామ్ పోతినేని పాత్రను రాశీ ఖన్నా ఇలా అనుకోకుండా బయటపెట్ట దం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. లోకనా యకుడు కమల్ హాసన్‌కు చెందిన నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మెరిక్ మీడియాతో కలిసి ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది.



## 'మండాడి' ఓటీటీ రిలీజ్‌కు డేట్ ఫిక్స్

తమిళ నటుడు సూరి, టాలీవుడ్ నటుడు సుహాస్ కలయికలో తెరకెక్కిన మోస్ట్ ఎవైటెడ్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'మండాడి' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి స్పందనను సొంతం చేసుకుంది. మదిమారన్ పుగళేంది దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మహిమా నంబియార్ కథానాయికగా నటించగా, సీనియర్ నటుడు సత్యరాజ్, అచ్యుత్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించారు. జీ.వీ. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. తమిళనాడు సముద్రతీర ప్రాంతం, అక్కడి మత్స్యకార కుటుంబాల జీవన పరిస్థితులు, ఉత్కంఠభరితంగా సాగే సంప్రదాయ పడవ పోటీలను ప్రధానంగా తీసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'మండాడి' సుహాస్‌కు తమిళంలో తొలి సినిమా కావడంతో తెలుగు ప్రేక్షకుల్లోనూ ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. వారి అంచనాలకు తగ్గట్టుగానే సుహాస్ తన నటనతో ఆకట్టుకున్నారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇదిలా ఉంటే విడుదలైన కొద్ది రోజులకే 'మండాడి' డిజిటల్ స్ట్రీమింగ్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. అక్టోబర్ 8 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో 'మండాడి' స్ట్రీమింగ్‌కు రానున్నట్లు తెలుస్తోంది. అయితే ఓటీటీ విడుదల తేదీపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## హీరోయిన్లను చూపించే విధానం మారుతోంది

టాలీవుడ్, కోలీవుడ్ చిత్ర పరిశ్రమల్లో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అమలా పాల్ కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్నారు. వ్యక్తిగత జీవితంలో బిజీగా ఉన్న ఆమె తాజాగా ఓ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. దక్షిణాది చిత్ర పరిశ్రమలో హీరోయిన్లను సరిగ్గా చూపించడం లేదనే విమర్శలపై స్పందించిన అమలా పాల్.. ఇందుకు మొత్తం చిత్ర పరిశ్రమను నిందించడం సరికాదని స్పష్టం చేశారు. కొన్ని సినిమాల్లో మహిళలను చూపించే విధానం సరిగ్గా లేకపోవడానికి పరిశ్రమ మొత్తం కారణం కాదని, అది ఆయా సినిమాల బృందం లేదా దర్శకుడి ఆలోచనా విధానానికి సంబంధించిన అంశం కావచ్చని పేర్కొన్నారు. అదే సమయంలో కాలంతో పాటు పరిస్థితులు మారుతున్నాయని, ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో మహిళా ప్రధాన కథాంశాలతో తెరకెక్కుతున్న సినిమాలు భారీగా వస్తున్నాయని గుర్తుచేశారు. తాను పరిశ్రమలోకి వచ్చి 15 ఏళ్లకు పైగా అయిందని, ఈ కాలంలో మహిళలు తమకు తగిన స్థానం కోసం ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ మార్పు రాబోయే రోజుల్లో మరింత సానుకూల వాతావరణాన్ని తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. ఎప్పుడూ ఒకే తరహా మూస పాత్రల్లో కనిపించడం కాకుండా కొత్తదనం ఉన్న కథలను ఎంచుకోవడానికే ఇష్టపడ్డానని అమలా పాల్ చెప్పారు. అందులో భాగంగానే 2019లో 'ఆడై' వంటి బోల్డ్, రిస్క్‌తో కూడిన చిత్రంలో నటించినట్లు గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తన ఇమేజ్‌పై ప్రభావం ఎలా ఉంటుందోనని, భవిష్యత్తులోనూ అలాంటి పాత్రలే వస్తాయేమో నని భయపడినట్లు వెల్లడించారు. అయితే ఇన్ని సంవత్సరాల అనుభవం తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే, ఆ రోజు తాను తీసుకున్న నిర్ణయం, చేసిన సాహసం చాలా పెద్దదిగా అనిపిస్తోందని అన్నారు. అయితే ప్రస్తుతం మాత్రం మళ్లీ అలాంటి సినిమా చేయగలనో లేదో తెలియదని, బహుశా అలాంటి పాత్రను మరోసారి చేయలేనేమోనని అమలా పాల్ నిజాయితీగా అంగీకరించారు.



Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.